

నావన్నీ నీవి కావాలి

అహం హరే తవ పాదైకమూల

దాసానుదాసో భవితాస్మి భూయః

మనః స్మరేతాసుపతే ర్గుణాంస్తే

గృణీత వాక్కర్మ కరోతు కాయః

హరీ! నీ చరణముల నాశ్రయించిన దాసులకు నేను దాసుడను కాగలను [illegible] ప్రాణనాథుడ వైన నీ గుణములను నామనసు స్మరించుగాక. నా నోరు సదా [illegible] కీర్తించుగాక! నా దేహము నీ సేవ నాచరించు గాక!

May I, O Hari, be born again as a servant of the devotees who have solely taken refuge in your holy feet. May my mind ponder and tongue celebrate the excellences of the Lord of my life and let my body do your service.



ఉపోద్ఘాతము

ఇది సప్తమ స్కంధము.

సప్తమ స్కంధము భగవానుని యొక్క హృదయము. అందుచేత వాసనా కంటకములను తొలగించే ప్రయత్నములో హృదయమును తన్మయ మొనర్చే రీతిలో హరినామ సంకీర్తనము జేసి తరించిన ప్రహ్లాద కుమారుని చరిత్ర ఇందు వర్ణింపబడినది.

సద్వాసనకు, అసద్వాసనకు సంఘర్షణయే ఈ సప్తమ స్కంధము. అసద్వాసనకు ప్రతిరూపము హిరణ్యకశిపుడు. సద్వాసనకు ప్రతిఫలము ప్రహ్లాదుడు.

మనుజుడు వంద సంవత్సరముల ఆయువును పొంది యుండును. అందు సగభాగము నిద్రయందు గడచును. పది సంవత్సరములు బాల్య చేష్టలలో జారిపోవును. పది సంవత్సరములు ఆటలలో సాగిపోవును. ముసలితనములో ఇరువది సంవత్సరములు వృథాయగును. మిగిలిన కొద్ది కాలమును విషయ సుఖానుభవములో గడుపుచున్నాడు. ప్రశస్తమైన మానవజన్మను వ్యర్థము చేయుచున్నాడు. ఈ విధమైన దోష జీవితమును నిరసిస్తూ బ్రతుకును ఆనందముగా గడుపు కొనుటకు నామ సంకీర్తనమును సాగింపుమని ప్రహ్లాదుడు తెలుపును.

భక్తి నిరోధ స్వభావము. అందుచేత కోరికలను కదల నివ్వదు. భక్తిలో నిష్కామ భావనయే యుండును.

రాక్షసుడై పుడితే తప్పులేదు. రాక్షసుడుగా జీవించడము దోషము యని ప్రహ్లాదుని చరిత్ర మనలను హెచ్చరించును. పరమాత్మ దివ్యధామమును చేరి తరించుటకు ప్రహ్లాదుడు నవవిధ భక్తి స్వరూపములను కూడా తెలిపెను.

భాగవత మనెడి పేరును వినగానే ప్రహ్లాదుడు మన స్మృతిపథంలో మెదలును. ఈ స్కంధము మహాభక్తుడైన ప్రహ్లాదుని చరిత్రతో నిండియున్నందున ఇది పరమోత్కృష్టమైనది. నిత్యము దీనిని శ్రవణము చేసి, ఆచరించు వారు తప్పక హరికృపకు పాత్రులయ్యెదరు.

చైతన్య భాగవతము

సప్తమ స్కంధము

అవతార వైశిష్ట్యము

పరమాత్మ సమస్త ప్రాణికోటికి ప్రభువు. సర్వులపై అతని కృపావృష్టి సమానముగా వర్షించును. అతడు సత్యమూర్తి. నిత్యదీప్తి. అతడు నిన్ను సదా వెన్నంటియే యున్నాడు. అతడు నిన్ను ఆశీర్వదించగనే ప్రపంచమంతా నీ ముందు మోకరిల్లును. ఊడిగము చేయును. అట్టి పరమాత్మ చరణకమలములను ధ్యానించుటయే జీవికి ఏకైక శరణ్యము. పాంచభౌతికమైన ఈ దేహము మృత్యుముఖంలో ప్రవేశింపక మునుపే శ్రీహరిని ధ్యానించి తరించు భక్తులు ధన్యులు.

భక్తి తెలిసిన వానికి భారము తెలియదు. బోధ గ్రహించిన వాడు బాధను గ్రహించడు. భగవంతుని బండిలో ఎక్కి పయనించువాడు ప్రత్యేకంగా తన వస్తువులను తాను మోయ నవసరం లేదు. ఏ హాని జరుగునో యనే తలంపే మనస్సున స్ఫురించదు. శుభకరుడైన శ్రీహరిని నమ్మి జీవించువారలకు అశుభము లెలా కలుగును? వచ్చిన నష్టాలు రాబోయే లాభాలకు సోపానములని భక్తు డొక్కనికే తెలుసు.

ఒకనాడు ధనం దగా చేస్తుంది. దుహితలు దూరమౌతారు. బంధువులు బరువౌతారు. మేడలు కూలిపోతాయి. మమతలు మాసి పోతాయి. కుమారులు కనుమరు గవుతారు. అర్ధాంగి ఆదుకోలేదు. పదవులు పారిపోతాయి. కీర్తి ఆరిపోతుంది. బ్రతుకు రాలిపోతుంది. ఇందుకేనా మానవ జీవితం?

మారిపోయే మనుజులను ప్రేమించి సాధించే దేముంటుంది? కారిపోయే ఆయువును ఎంతకాలం పట్టి బంధించగలం? ముట్టదగింది పట్టదగింది భగవచ్చరణారవిందమే. బ్రతుకుకు పరమార్థమే అర్థము. జీవికి దేవుడే గమ్యము. ప్రభువును తెలియని రాజు బికారియే. ప్రభువు నెరిగిన బిచ్చగాడు చక్రవర్తియే. స్వప్నగత సుఖాలు నీకు ఆనందాన్నివ్వవు. నిజవెలుగే నిత్యవెలుగు.

ఉన్నది ఉండనీ. నాదన్నది ఉండనీకు. తనదన్నది ఉండనీ. నేనన్నది మండనీ. అహంకారము తియ్యని విషము. విడదీయలేని కల్మషము. వినయము చల్లని అమృతము. చెడిపోని మాధుర్యము. అసద్వాసనలు అంతరించాలి. మిశ్రమ వాసనలు మిగిలిపోవాలి. సద్వాసనలు సంపదలై నిలవాలి. భక్తిని పండించాలి. బ్రతుకును ఆనందంతో నిండించాలి. అసద్వాసనాపరులు రాక్షసులు. మిశ్రమవాసనాపరులు మానవులు. సద్వాసనాపరులు భక్తులు.

సద్వాసనకు, అసద్వాసనకు సంఘర్షణయే ఈ సప్తమ స్కంధము. అసద్వాసనకు ప్రతిరూపము హిరణ్యకశిపుడు. సద్వాసనకు ప్రతిఫలము ప్రహ్లాదుడు.

గురుదేవుడైన శుకబ్రహ్మకు వందన మాచరించి పరీక్షిత్తుడు ప్రశ్నించుచున్నాడు. "మహాత్మా! పరమాత్మ జ్ఞానస్వరూపుడు. సమదర్శనము గల దివ్యాత్ముడు. ఆయన సర్వులకు ప్రియుడే గదా! అట్టి భగవంతుడు దేవతల కొఱకు దైత్యులను సంహరించుట ఏమిటి? ఈ పక్షపాత మెలా ఏర్పడెను? ప్రేమమయుడైన భగవానునకు అసురులపై ద్వేషమెలా కలుగును? ఈ విషయముల యందు నా మనస్సు సంశయగ్రస్థమై యున్నది. నా సందేహములను దయఉంచి నివృత్తి చేయుడు" అని పరీక్షిత్తు ప్రార్థించెను.

దేహమున్నంత వరకు సందేహము కూడా కలసియే యుండును. సందేహము వ్యక్తిని సన్మార్గము నుండి మఱలించును. గుంటలో నిలిచిన నీరు గుంటను మురికి చేయునట్లు మనస్సులో తిష్ఠవేసిన సంశయము మనస్సునే పాడుచేయును. "నీ హృదయంలో తుపాకి గుండునైనా పెట్టుకోగాని సందేహాన్ని మాత్రం ఉంచుకోకు" అంటారు స్వామి రామతీర్థ.

దేహము మాంసమయము. మనస్సు మీమాంసమయము. సందేహము మనస్సులో జనించవచ్చు. కానీ జీవించకూడదు. సందేహము రాగానే గురువుల నాశ్రయించి నివృత్తి చేసుకోవాలి. గురువు లభించనిచో పరమాత్మకే నివేదించాలి. అంతరంగమందు నిలచిన సందేహాన్ని అంతర్యామి తొలగించగలడు.

సందేహమును దీర్చవయ్య సాకేత నిలయ రామయ్య

అని త్యాగయ్య తన సందేహమును రామయ్య ముందుంచినాడు.

"రాజా! మంచి ప్రశ్న నడిగితివి. నీ సంశయము సముచితమైనదియే. విష్ణుకథలు విస్మయ స్వరూపములు. విచారణచే లభ్యములు. అవి పవిత్రములు. నారదాది మునులు ఈ గాథలను సదా పరవశించి గాన మొనరించు చుందురు. అవి త్రైలోక్య పావనములు మునులనెడి అరణ్యములకు చైత్రమాసములు."

క॥ చిత్రంబులు త్రైలోక్యప
విత్రంబులు భవలతాలవిత్రంబులు స
న్మిత్రంబులు మునిజనవన
చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్.

యని పలికి, వ్యాస భగవానునికి నమస్కరించి చెప్పుట కుపక్రమించెను.

పరమేశ్వరుడు నిర్గుణుడు. అజుడు. నిత్యుడు. శాశ్వతుడు. దేహేంద్రియ మనో బుద్ధుల కతీతుడైనను బాధ్యభావక భావమును స్వీకరించి యున్నాడు. త్రిగుణములు మాయకు సంబంధించినవియే గాని మాధవునకు సంబంధించినవి గావు. గుణములు స్థిరములు గావు. స్థిరుడైన పరమాత్మ అస్థిరమైన గుణములు వృద్ధినొందు సమయాన సృష్టి నొనరించెను. సత్త్వగుణ వృద్ధిలో దేవతలను, ఋషులను, రజో గుణ వృద్ధిలో అసురులను, తమోగుణ వృద్ధిలో యక్ష, రాక్షసాదులను విభజించెను.

ఈ భిన్నత్వము నందు పరమాత్మ ఏకమై యున్నాడు. కట్టెలు అనేకము లైనా అగ్ని యొక్కటే. పాత్రలువేరైనా జలములో మార్పులేదు. గదులు వేరైనా గగనములో మార్పు ఉండదు. సురాసురుల యందు, సర్వప్రాణుల యందు పరమాత్మ సమంగా వ్యాపించి యున్నాడు. వివేకులు అంతరాత్మను దర్శించి ఆనందించుచుందురు. అందరూ ఆత్మను దర్శించలేరు.

ఏష సర్వేషు భూతేషు గూఢోఽత్మా న ప్రకాశతే
దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మ దర్శిభిః

"సర్వభూతము లందును ఆత్మ నిగూఢమై యున్నందున సర్వులు దానిని గాంచలేక యున్నారు. కాని సూక్ష్మబుద్ధి గలవారు సూక్ష్మాతి సూక్ష్మమైన ఆత్మను దర్శింప గలుగుచున్నారు" అని కఠోపనిషత్తు సందేశము.

ఈశ్వరుడు సముడు. ఆ దివ్యాత్ముని యందు సమత్వమే గాని విషమత్వ ముండదు. విషమత్వము, భేదరూపము మాయ యొక్క స్వభావము. అలలు కదలు చుండగా చంద్రుడు కదలినట్లు మనకు గోచరించును. అలాగే పరమాత్మయందు భేదము ఆరోపింప బడినది.

"రాజా! పూర్వము రాజసూయ యజ్ఞ సమయమున ఈనాడు నీవు నన్నడిగిన ప్రశ్ననే మీ పితామహుడగు ధర్మరాజు నారదమహర్షిని అడిగెను. ఆ విషయమును చెప్పెదను వినుము" అని శుకబ్రహ్మ చెప్పుట కుపక్రమించెను.

శిశుపాలుడు కృష్ణద్వేషి. రాజసూయ యాగమున శ్రీకృష్ణుని పూజించుటకు విముఖత చూపెను. భగవంతుని అనేక విధములుగ నిందించెను. దూషించెను. శ్రీకృష్ణుడు చివరగ సుదర్శన చక్రముతో శిశుపాలుని శిరమును ఖండించెను. అతని దేహము నుండి కదలి వచ్చిన జ్యోతి శ్రీకృష్ణునిలో లీనమయ్యెను. ఈ విధంగా శిశుపాలునకు సద్గతి కల్గుటను గాంచి విస్మయ చిత్తుడైన ధర్మరాజు నారదమహర్షిని ప్రశ్నించెను.

"మునివర్యా! శిశుపాలుడు పరమాత్మద్వేషి. శ్రీకృష్ణునితో శత్రుత్వమును పెంచుకొని నాడు. అట్టివానికి ముక్తి ఎలా లభించినది? అతడు నరకమునకు ఎందులకు పోలేదు?

దంతవక్త్రుడు కూడా శ్రీకృష్ణ ద్వేషియే. వారిరువురి నాలుకలు పరమాత్మ నిందనే చేయు చుండినవి. వారికి ఘోర నరకమేల లభించలేదు? సర్వులు వీక్షించు చుండగా వారు వాసుదేవుని యందు విలీనమైనారు. ఇది నా కవగతమగుట లేదు. వాయువుచే దీపజ్వాల అస్థిరమైనట్లు నా బుద్ధికూడా చలించుచున్నది. నీవు సర్వజ్ఞుడవు. దయచేసి నా సంశయమును తొలగింపుము" అనెను. ధర్మరాజుతో నారదమహర్షి నవ్వుతూ ఇలా చెప్పెను:

"ధర్మరాజా! నిందాస్తుతులను, సత్కార తిరస్కారములను అనుభవించుటకే ఈ దేహము ప్రాప్తించినది. దేహాభిమానము వలన జీవులకు "నేను - నాది" యనెడి భావములు కలుగుచున్నవి. పరమాత్మకు దేహాభిమాన ముండునా? అందుచేత ఆయనలో ద్వంద్వాలకు స్థానములేదు. ఆయనకు ద్వేషము తెలియదు. ద్వేషి తెలియడు. ఏ భావము చేతనైనను పరమాత్మను పొందవచ్చును.

ఆ॥ అలుక నైన జెలిమి నైన గామంబున నైన బాంధవమున నైన భీతి
నైన దగిలి తలప నఖిలాత్ము డగు హరి జేరవచ్చు వేఱు సేయ డతడు.

"మానవుడు శతృత్వము ద్వారా భగవంతుని పొందినంత సులభముగా భక్తిద్వారా పొందలేడని నా అభిప్రాయము" అని పలికి నారదుడు వివరముగా చెప్పసాగెను.

శతృభావముతో పరమాత్ముని సదా చింతించుట వలన శతృభక్తుడై విష్ణు సాయుజ్యమును పొందుచున్నాడు. భక్తితో కొందరు శ్రీకృష్ణుని పొందినట్లు, కొందరు కామముద్వారాను, కొందరు ద్వేషమువలనను, కొందరు భయముచేతను, మరి కొందరు స్నేహమువలనను పరమాత్మనుబొంది తరించియున్నారు.

గోప్యః కామాద్భయా త్కంసో ద్వేషాచ్చై ద్యాదయో నృపాః
సంబన్ధా ద్వృష్ణయః స్నేహా ద్యూయం భక్త్యా వయం విభో ॥

"గోపికలు కామమువలన, కంసుడు భయమువలన, శిశుపాలాది రాజులు వైరము వలన, యాదవులు స్నేహమువలన, మేము భక్తివలన శ్రీకృష్ణుని పొందుట జరిగినది" యనెను.

ఈ ఐదు విధములైన సంబంధముల ద్వారా శ్రీకృష్ణుని పొందవచ్చును. కానీ ఈ ఐదింటిలో ఏ ఒక్కటీ లేని నాస్తికుడగు వేనరాజునకు సద్గతి లభింపలేదు. కనుక ఏ విధముగా నైన పరమాత్మ యందు చిత్తమును నిలుపుటయే ప్రధానము.

తస్మాత్కేనా ప్యుపాయేన మనః కృష్ణే నివేశయేత్

"ఏ విధమైన ఉపాయము చేతనైనను శ్రీకృష్ణుని యందే మనస్సు నుంచవలెను" అని నారదుడనెను.

కొందరు గోపికలు తెలియక శ్రీకృష్ణుని అందమును జూచి ప్రేమించిరి. కాల క్రమమున అజ్ఞాన మేఘములు తొలగించబడి కృష్ణగత చిత్తులైరి. భగవంతుని యందు కలిగిన కామము కాలగతిలో నిష్కామమగును. కంసుడు సదా భయముచే శ్రీకృష్ణునే

స్మరించుచుండెను. తద్వారా సద్గతిని పొందెను. మనస్సులో ఏ భావము కదలినను అది శ్రీకృష్ణునిదై యుండాలి. ఇదియే సర్వోత్తమమైన యోగము.

తదర్పితాఖిలాచారః సన్ కామక్రోధాభి మానాదికం తస్మిన్నేవ కరణీయమ్

"సమస్త వ్యవహారములను భగవంతుని యందు సమర్పించి, కామ, క్రోధ, అభిమానాదులను గూడా భగవంతుని యందే చూపవలెను" అని నారదుడే భక్తి సూత్రముల యందు కూడా తెలిపి యున్నాడు.

"ధర్మరాజా! మీ పినతల్లి కుమారులగు శిశుపాల దంతవక్త్రులు పూర్వము వైకుంఠ ద్వారము వద్ద పార్షదులై యుండిరి. బ్రాహ్మణుల శాపకారణముగ వారు భూలోకమున జన్మించిరి" యని నారదుడనెను.

"మహర్షీ! ఇది మరీ వింతగా యున్నది. శ్రీహరి ఏకాంతభక్తులకు ఈ పతనావస్థ ఏమిటి? పుణ్యాత్ములైన విష్ణుపార్షదులకు ఇట్టి జన్మమేల సంప్రాప్త మయ్యెను? వారికి శాపము నిచ్చిన బ్రాహ్మణులెవరు? ఎందులకు శపించిరి? ఆ విషయములను సవిస్తరముగా వివరింపుడు" యని ధర్మరాజు అడుగగా నారదమహర్షి జరిగిన కథ నంతటిని చెప్పెను.

ఒకప్పుడు బ్రహ్మమానస పుత్రులగు సనక సనందనాది మహర్షులు విష్ణులోకమునకు వచ్చినారు. వారు దిగంబరులు. ఆరు సంవత్సరముల బాలురవలె కన్పింతురు. వారు వైకుంఠద్వారము వద్దకు రాగానే విష్ణుదేవుని పార్షదులగు జయవిజయులను విరువురు వారిని బాలురని భావించి లోనికి అనుమతించలేదు. మహర్షులు క్రుద్ధులై వారిని శపించిరి.

క॥ వారించిన తమకంబున, వా రించుక నిలువలేక వడి దిట్టిరి దౌ
వారికుల నసురయోని న వారితులై పుట్టు డనుచు వసుధాధీశా!

"ధర్మరాజా! క్రుద్ధులైన సనకాది ఋషులు వారిని రాక్షస జన్మమెత్తు" డని శపించిరి అని నారదుడనెను.

శాపగ్రస్తులైన జయవిజయులను గాంచి కృపామయులైన ఋషులు "మూడు జన్మల పిదప మీరు తిరిగి వైకుంఠమును చేరెదరు" అని పలికిరి.

మునుల శాపఫలంగా ఆ జయవిజయులే దితికి హిరణ్యకశిప, హిరణ్యాక్షులుగా జన్మించిరి. శ్రీహరి నరసింహరూపము ద్వారా హిరణ్యకశిపుని, వరాహరూపము ద్వారా హిరణ్యాక్షుని వధించెను. విముక్తిని ప్రసాదించెను.

హిరణ్యకశిపుని కుమారుడు ప్రహ్లాదుడు. విష్ణుభక్తుడు. అతనిని వధించుటకు తండ్రియగు హిరణ్యకశిపుడు అనేక విధముల యత్నించెను. అయినను ఆ బాలుని సంహరించ లేకపోయెను.

ఆ జయవిజయులే తరువాత జన్మలో రావణ కుంభకర్ణులుగ జన్మించిరి. వారు లోకకంటకులైరి. శ్రీహరి శ్రీరాముడై అవతరించి వారిని సంహరించెను. వారే తమ మూడవ జన్మలో మీ పినతల్లి కొడుకులైన శిశుపాలదంతవక్త్రులుగా జన్మించిరి. శ్రీకృష్ణుడు సుదర్శనచక్రము ద్వారా వారిని వధించి ముక్తి నొసంగెను.

నారదుని ద్వారా ఈ వృత్తాంతముల నెరిగిన ధర్మరాజు హిరణ్యకశిపునికి తన బిడ్డడైన ప్రహ్లాదుని యందు వైరభావ మేర్పడుటకు గల కారణమును తెలుపమని అడుగగా నారదుడు ప్రహ్లాదుని దివ్యచరితమును వినిపించసాగెను.

హిరణ్యకశిపుడు

దితికి హిరణ్యకశిప, హిరణ్యాక్షులను ఇరువురు కుమారులు గలరు. దితి యనగా భేదబుద్ధి. భేదబుద్ధికి మమకార అహంకారములే బిడ్డలు. హిరణ్యకశిపుడు అహంకారము కాగా, హిరణ్యాక్షుడు మమకారమునకు ప్రతీకమాయెను. అహంకారమును నశింప చేయుట బహుకష్టము. ముందు మమకారమును నశింప చేయుగల్గినచో, అటు పిమ్మట అహంకారమును నశింప జేయవచ్చును. భోక్తృత్వభావము ముందు నశిస్తే, తరువాత కర్తృత్వభావము నశిస్తుంది. దీనినే యోగమని, సన్యాసమని భగవద్గీత తెలిపింది.

శ్రీహరి వరాహ రూపమును ధరించి హిరణ్యాక్షుని వధించెను. హిరణ్యకశిపుడు కోపోద్రిక్తుడాయెను. "బలాన్వితుడగు నా సోదరుని శ్రీహరి సంహరించెను. నేను శూల ధారినై శ్రీహరి కంఠమును త్రుంచెదను. ఆ రక్తముతో రక్తప్రియుడగు నా సోదరునకు తర్పణము విడిచెదను. అప్పటికి గాని నా ఆవేదనా జ్వాల ఆరదు.

తస్మిన్ కూటేఽహితే నష్టే కృత్తమూలే వనస్పతౌ
విటపా ఇవ శుష్యన్తి విష్ణు ప్రాణా దివౌకసః

"చెట్టు యొక్క మూలము ఖండించబడగానే శాఖలు మున్నగునవి తమకు తాముగా ఎండిపోవునట్లు, నాకు శత్రువుయైన శ్రీహరి నశించుటచే విష్ణుపార్షదులగు దేవతలు కూడ నశింతురు" యని హిరణ్యకశిపుడు సచివులతో పలికెను.

ఈ లోగా తపస్సులను, యజ్ఞములను, వ్రతములను ధ్వంసము చేయుమని ఆజ్ఞాపించెను. దానవులు విజృంభించిరి. గోవులను వధించిరి. బ్రాహ్మణులను హింసించిరి. నగరములను కొల్లగొట్టిరి. గృహములను దగ్ధమొనర్చిరి. దానవ దౌర్జన్యము ఒకవైపు కొన సాగుచుండ, దానవరాజగు హిరణ్యకశిపుడు తల్లియగు దితి వద్దకు వచ్చెను. సోదరుని భార్య భానువు కూడా అక్కడే యుండెను. హిరణ్యకశిపుడు చక్కని తాత్త్విక విషయము లను బోధించి వారిని ఊరడించెను.

"మాతా! భ్రాతృజాయా! వీరుడు, నాకు సోదరుడు నైన హిరణ్యాక్షుని గూర్చి మీరు చింతింపవలదు. అతడు వీరమరణము నొందెను. ఇది స్తుతింప దగినదియే గాని విలపింప దగినది కాదు" అని చెప్పసాగెను.

బాటసారులు చలివేంద్రలో కలసి తమ తమ గ్రామములకు వెళ్ళుచుందురు. ప్రపంచ చలివేంద్రలో జీవులందరూ బాటసారులే. కలియుట విడిపోవుట సహజము.

శా॥ నీరాగారనివిష్టపాంథులక్రియన్ విక్కంబు సంసారసం
చారుల్ వత్తురు గూడి విత్తురు సదా; సంగంబు లే దొక్కచో
ఘరుల్ వోయెడి త్రోవ బోయెను భవత్పూమండు దల్లీ! మహా
ఘరుం డాతఁడు తద్వియోగమునకున్ శోకింప నీ కేటికిన్.

ఇక్కడ తల్లెవరు? కుమారు లెవ్వరు? అంతా భ్రాంతియే. ఈ బంధాలు వీడిపోయే వియే. వాడిపోయేవియే.

ఆత్మ అమరము. నిత్యము. నిర్మలము. సర్వగతము. అందుచేత దుఃఖింప నవసరము లేదని హిరణ్యకశిపుడు చెప్పుచున్నాడు.

"అమ్మా! ఈ విషయమున పురాతనమైన ఒక కథ గలదు. మరణించిన వాని బంధువులతో యమధర్మరాజు పలికిన వాక్యముల నాలకింపుడు" అని చెప్పుట కుప క్రమించెను.

ఉశీనర దేశమున సుయజ్ఞుడను రాజుండెను. అతడు యుద్ధమున మరణించెను. వాని బంధువులు, రాణులు చుట్టూచేరి విలపించు చుండిరి. రాణుల దుఃఖము తీవ్ర మాయెను. వారి ఆక్రందన శబ్దము యమపురికి వినిపించెను. యముడు బాలుని రూపము ధరించివచ్చి వారితో భాషించెను.

యముడు వారిని గాంచి విస్మితుడయ్యెను. మరణము అనివార్యమని తెలిసి కూడా వీరు తాము స్థిరమైనట్లు దుఃఖించుచున్నారని భావించెను. వీరికన్నా శిశువులే నయమని చింతించెను.

ఉ॥ మచ్చిక వీరికెల్ల బహుమాత్రముఁ జోద్యము దేహి పుట్టుచుం
జచ్చుచు నుంట జూచెదరు చావక మానెడువారిభంగి నీ
చచ్చినవాని కేడ్చెదరు చావున కొల్లక డాఁగవచ్చునే?
యెచ్చట బుట్టె నచ్చటికి నేగుట నైజము ప్రాణికోటికిన్.

బాలుని రూపములో యున్న యముడు రాణులతో ఇలా చెప్పెను: "ఈ ప్రపంచ మంతయు పరమేశ్వరుని ఆజ్ఞచే నడచుచున్నది. ఇది ఆయనకు ఆటవస్తువు. ఈశ్వరుని అనుగ్రహ మున్నచో అరణ్యమున యున్నను రక్షింపబడుదురు. ఆయన దృష్టికి దూరమై నచో మనోహరమైన మేడలలో వసించినను రక్షింపబడలేరు" యనెను.

"అబలలారా! ఇంతవరకు ఎవరికొఱకు మీరు దుఃఖించు చుంటిరో అతడు ఇక్కడ నరుండియే యున్నాడు గదా! ఈ శవము మీతో మాటలాడునా? మాటలాడని దేహము ఇక్కడ పడియున్నది. దానికై ఏల దుఃఖించెదరు? మాట్లాడెడివాడు వినెడివాడు ఎవ్వడ యితే ఇప్పుడు తెలియుటలేదో అతడు ఎప్పుడూ అగోచరుడే కదా! ఇక దేనికి మీ విలాపము? గోచరములన్నియు ఒకనాటికి అగోచరములే. కనుపించినవి ఏవియైనను కనుమరుగయ్యేవియే" యనెను.

ఈ విధమైన వైరాగ్య భావములను హిరణ్యకశిపుడు దితికి చెప్పెను. హిరణ్యాక్షుని మరణానికి చింతించి ప్రయోజనము లేదని పలికెను. జ్ఞానపూరితమైన హిరణ్యకశిపుని వాక్కులను దిత్యాదులు అవధానముతో ఆలకించసాగిరి.

కం॥ పరులెవ్వరు? దా మెవ్వరు?, పరికింపగ నేక మగుట భావింపరు త
త్పరమజ్ఞానము లేమిని, బరులును మే మనుచు దోచు బ్రాణుల కెల్లన్

యని హిరణ్యకశిపు డనెను. అతని మాటలు దితికి, కోడళ్ళకు ఊరట వందించెను.

ఇదియే విచిత్రము! ఇదియే మాయ! ఒకవైపు జ్ఞానము నుపదేశించి, వారిలో వైరాగ్యము నుదయింప జేయుచుండెను. మరొకవైపు శ్రీహరి నెలా సంహరింపవలెను? అని ఆలోచించు చుండెను. ఇదియే హిరణ్యకశిపుని ద్వంద్వ మనస్తత్వము. ఇతరులకు చేయు బోధలు తనకు ఉపకరించుట లేదు. తా నాచరింపక ఇతరులకు బోధించువా రెవ్వరైనను అసురులే. హిరణ్యకశిపులే. ఇట్టివారికి సద్గతియుండదు. వారికొక నీతి, ఇతరులకొక నీతిగా విభజించుకొని పాలించుచుందురు. వారు చెప్పిందే నీతి. వారు నడిచిందే నిజాయితి. వాస్తవానికి వీరే అవినీతిపరులు. అధర్మ పరాయణులు.

Lawless are they that make their wills their law

"తమ భావాలనే చట్టముగా మలచువారే వాస్తవానికి చట్టవ్యతిరేకులు" యని షేక్స్పియర్ కూడా అభిప్రాయ పడినాడు.

హిరణ్యకశిపుని ఉగ్రతపస్సు

మందరాచల పర్వతముపై హిరణ్యకశిపుడు భయంకరమైన తపస్సును ప్రారంభించెను. ముల్లోకముల యందు తనకు సాటివచ్చువారు ఉండకూడదని అభిప్రాయపడెను. అజేయుడై, జరామృత్యువులు లేనివాడుగ నుండవలెనని సంకల్పించెను. కాలి బొటన వ్రేలిపై నిలబడెను. దృష్టిని గగనముపై సారించెను. అతని ఉగ్రతపస్సును గాంచి సురులు భీతిచెందిరి.

వాని తపోమహిమచే అంతరిక్షము అగ్నిమయము కాజొచ్చెను. నదులు, సాగరములు కలత చెందెను. పర్వతములు కదలసాగెను. దిక్కులంతట ధూమము వ్యాపించెను. దేవతలు బ్రహ్మదేవుని సమీపించి మొరపెట్టుకొనిరి. దైత్యుని తపోగ్నిజ్వాలకు దివిలో చరించుట కష్టతర మగుచున్నదని తెలిపిరి. ఈ ఉపద్రవమును తొలగించమని ప్రార్థించిరి.

బ్రహ్మ మందరాచలమున కేతెంచెను. హిరణ్యకశిపుని చుట్టూ పుట్టలు లేచియుండెను. గడ్డి మొలచియుండెను. వెదురు ప్రాకియుండెను. చర్మము, మాంసము చీమలు మున్నగు కీటకముల చేత భక్షింపబడి యుండెను.

"దితికుమారా! కాశ్యపా! లెమ్ము. శుభమస్తు. నీవు తపస్సిద్ధిని బొందితివి. అభీష్ట మును తెలుపుము. తీర్చెదను. ఋషులకుకూడా సాధ్యముగాని తపము నాచరించితివి. నన్ను వశపరచుకొంటివి. వరముల నడుగుము" అని విరించి పలికెను. తన కమండలము లోని పవిత్రోదకమును దైత్యునిపై విధాత సంప్రోక్షించెను. వెంటనే హిరణ్యకశిపుడు బల తేజోసంపన్నుడు, వజ్రతుల్యుడునై పుట్టనుండి బయల్వెడలెను. బ్రహ్మదేవునకు వందన మాచరించెను.

అసురేంద్రుని నయనములు అశ్రువులను స్రవించెను. ఆహ్లాదము వృద్ధిహొంద కంఠము గద్గద మాయెను. రోమహర్షణుడై తలవంచి ప్రణామము లర్పించెను.

యది దాస్యస్యభిమతాన్ వరాన్మే వరదోత్తమ
భూతేభ్యస్త్వద్వి సృష్టేభ్యో మృత్యుర్మా భూన్మమ ప్రభో

"వరముల నొసగువారలలో ఉత్తముడవగు ఓ దేవా! నీవు నాకు వరము లీయదలచి నచో నీచే సృజింపబడిన ప్రాణులవలన నాకు మరణము కలుగకుండునట్లు ఆశీర్వదింపుము.

"అంతర్బాహ్యములందు, రాత్రింబవళ్ళయందు, వస్తువులవలన, అస్త్రములవలన, పృథ్వియందు, గగనమందు, మనుజులవలన, మృగాది పశువులవలన నాకు మరణము లేకుండు నట్లు వరములిమ్ము" అనెను.

శా॥ గాలిం గుంభిని నగ్ని నంబువుల నాకాశస్థలిన్ దిక్కులన్
రేలన్ ఘస్రములం దమఃప్రబల భూరిగ్రాహరక్షోమృగ
వ్యాళాదిత్యనరాదిజంతుకలహవ్యాప్తిన్ సమస్తాస్త్రశ
స్త్రాళిన్ మృత్యువులేని జీవనము లోకాధీశ! యిప్పింపవే.

సంకల్పశుద్ధి లేనివాని సాధనలు పతన హేతువులే యగును. దైత్యుని తపస్సు వెనుక శుద్ధిలేదు. అందుచేత అతడు విచిత్రమైన వరము కోరెను. శుద్ధిలేని బుద్ధి ఎన్నటికీ సిద్ధిని బొందలేదు.

"కాశ్యపా! నీవడిగిన వరములు ఎవ్వరికీ లభింపవు. ఇంతవరకు ఇలాంటి వరము లను ఇతరులు కోరనూలేదు. మేము అనుగ్రహించినదియూ లేదు. నిన్ను కరుణించి ఇవన్నియు నొసంగితిని. బుద్ధిశాలివై మెలగుము" అని పలికి బ్రహ్మదేవుడు అంతర్హితు డయ్యెను.

దైత్యుని దురంతములు

హిరణ్యకశిపుడు వరములను బొందెను. క్రొవ్వి గర్వితుడయ్యెను. తన సోదరుని మరణమునకు కారణమైన శ్రీహరిపై పగబూనెను. వాని దురంతములకు అవధులు లేకుండెను. ఈనాడు గంధర్వులను చావబాదును. రేపు సురులను గొట్టును. మరునాడు నాగులను హింసించును. ఇంకొకనాడు నవగ్రహములను బంధించును. వేరొకనాడు

విహరించు పక్షులను చేతులతోపట్టి నలిపి పడవేయును. సిద్ధులను బాధించును. బుద్ధి మంతులను పరాభవించును. ముల్లోకములను కంపింపజేసెను. "ఈవేళ ఏమి జరిగింది, ఈనాటి వార్త లెలా ఉన్నాయి" అని ప్రతిరోజు దేవతలు ముచ్చటించుకొని నూతన విషయములను తెలిసికొను చుండిరి.

నారదుడు ధర్మజునితో చెప్పుచున్నాడు: "రాజా! వాని సేవకులు దేవతలకు యజమానులయ్యారు. మా రాజు కర్పూర వాసనగల తియ్యని కల్లు త్రాగి నిద్రించుచున్నాడు, దేవతలారా! మెల్లగా సంచరింపుడు. మునులారా! దూరముగా నిలబడి స్వస్తి పలుకుడు. నాగులారా! పొరపాటున పడగలెత్తెదరేమో! జాగ్రత్త. దిక్పాలకులారా! తలవంచి చనుడు. గంధర్వులారా! మీలో నిపుణు లెవరో వారే గానము చేయండి. కావు కావు మన్నచో చావు తప్పదు. ధర్మరాజా! నిజము చెప్పక తప్పదు. వాడు కల్లుత్రాగి మత్తెక్కి పడియుండగా నేను, తుంబురుడు మెల్లగా రాగము లాలపించెడి వారము" అని చెప్పసాగెను.

ఋత్విక్కులు చేయు యజ్ఞముల యందు దేవతలకిచ్చు హవిస్సులను వాడే గ్రహించును. దేవ, మానవ, ఋష్యాదులు దిక్కుతోచని వారైరి. సర్వులు విష్ణుమూర్తిని శరణుజొచ్చిరి.

ఉ॥ ఎక్కడ నున్నవాడు జగదీశ్వరు డాత్మమయుండు మాధవుం
డెక్కడి కేగె శాంతులు మునీశులు భిక్షులు రారు క్రమ్మఱం
దిక్కుల నెల్ల నెక్కుడు తుదిం జొర దిక్కగు నట్టి దిక్కుకై
మ్రొక్కెద మేము హస్తయుగముల్ ముకుళించి మదీయరక్షకున్.

యని శ్రీమహావిష్ణువును ప్రార్థించిరి.

"విబుధులారా! భయపడకుడు. దైత్యుడగు హిరణ్యకశిపుని దురంతములను నేను ఎఱిగియే యున్నాను. కాలము సమస్తమును శాంతింపజేయును. దేవతలను, గోవులను, వేదములను, భక్తులను, నన్ను ద్వేషించువాడు త్వరితగతిని పతనమొందును. అతడు నా భక్తుడగు ప్రహ్లాదుని హింసింప మొదలిడగనే, బ్రహ్మనుండి వరములను బొందియున్నను నేను అతనిని తప్పక వధింతును", అని విష్ణుదేవుడు పలికెను.

దేవతలు సంతసించిరి. దైత్యుడు మరణించినట్లేయని భావించిరి. బాధలు తీరినట్లే నని తలచిరి. శ్రీనాథుని మాటలు వృథాగావని వారికి తెలియును.

హిరణ్యకశిపునకు ప్రహ్లాదుడను పుత్రుడుదయించెను. అతడు సర్వులకు హ్లాదమును గూర్చువాడై ప్రహ్లాదుడాయెను. ప్రహ్లాదుడు అసురుడైనను సురులను ప్రేమించువాడై యుండెను. అతడు జితేంద్రియుడు. హరిభక్తి కలవాడు. ప్రశాంత చిత్తుడు. అహంకారము తెలియనివాడు. పెద్దల విషయములో దాసునివలె ప్రవర్తించును. దీనులపై పుత్రవాత్సల్య మును జూపును. చెలికాండ్రపై సోదరభావమును ప్రకటించును. ఆచార్యులపై పూజ్య భావమును ప్రదర్శించును.

సీ॥ తనయందు నఖిలభూతములందు నొకభంగి సమహితత్వంబున జరగువాడు
పెద్దల బొడగన్న భృత్యునికైవడి జేరి నమస్కృతుల్ సేయువాడు
కన్నుదోయికి నన్యకాంత లడ్డం బైన మాతృభావము సేసి మరలువాడు
తల్లిదండ్రులభంగి ధర్మవత్సలతను దీనుల గావ జింతించువాడు
తే॥ సఖులయెడ సోదరస్థితి జరుపువాడు దైవతము లంచు గురువుల దలచువాడు
లీలలందును బొంకులు లేనివాడు, లలితమర్యాదు డైన ప్రహ్లాదు డధిప.

భక్త ప్రహ్లాదుడు

ప్రహ్లాదుని చిత్తము పరమేశ్వరుని యందే లయించి యుండును. సౌందర్యముంది, కానీ గర్వము లేదు. ధనముంది, అభిమానములేదు. భోగ్య వస్తువులున్నవి, వానియందు స్పృహలేదు. శౌర్యముంది, క్రౌర్యములేదు. వస్తువులున్నాయి, కానీ వాంఛలులేవు. సుగుణము లన్నియు ఒక్కటై, సర్వనదులు సాగరమును జేరునట్లు, ప్రహ్లాదునిలో చోటు చేసుకున్నవి. శ్రీహరిని కళ్యాణగుణము లెట్లు వీడవో ప్రహ్లాదుని కూడా అలావీడకున్నవి. ఇంద్రాది దేవతలు కూడా ప్రహ్లాదుని సుగుణములను గీతములద్వారా ఆలపించసాగిరి.

క॥ గుణనిధి యగు ప్రహ్లాదుని గుణము లనేకములు గలవు గురుకాలమునన్
గణుతింప నశక్యంబులు ఫణిపతికి బృహస్పతికిని భాషాపతికిన్.

ప్రహ్లాదుని గుణములను ఆదిశేషుడు, బృహస్పతి, బ్రహ్మలకు కూడా వర్ణింప శక్యము గాకుండెను.

ప్రహ్లాదుని మనస్సు సదా శ్రీహరి పాదపద్మముల యందే రమించుచుండును. విష్ణు చింతనముచే జడునివలె ఒక్కొక్కసారి పడియుండును. ప్రపంచమంతయు శ్రీనాథుని కన్నను అన్యముగాదని యనిపించు చుండెను. వెన్నలాంటి ప్రహ్లాదుని హృదయము సదా వెన్నుని అనుసరించియే యుండును. అతడు ప్రేమమయుడు. ప్రేమ ప్రేమకొఱకే యనెడి భావము గలవాడు. బేరము లెరుగడు. భారములు తెలియడు. వెనుదిరగని విశ్వాసముతో విష్ణువును వెదికెను. అతని భక్తి పర్వతములను సైతము చలింపజేసినది. అతడు ఆడును. ఆడించువాడు గోచరింపగనే ఆటకట్టును జూచును. ఆలోచనలు కదలించును. ఆలోచింప జేయువాడు అగుపించగనే ఆలోచనలను మఱలించును. మాటలాడును. మాటలాడించు వానిని గాంచి మూగయగును. కళ్ళుండి ఒక్కొక్కసారి అంధుడగును. బధిరుడగును. భక్తిలో సర్వమూ తానై నిలుచును.

సీ॥ శ్రీవల్లభుడు దన్ను జేరినయట్లైన జెలికాండ్ర నెవ్వరి జేరమఱచు
నసురారి దనమ్రోల నాడినయట్లైన నమరబాలురతోడ నాడ మఱచు
భక్తవత్సలుడు సంభాషించినట్లైన బరభాషలకు మాఱుపలుక మఱచు
సురవంద్యు దనలోన జూచినయట్లైన జొక్కి సమస్తంబు జూడ మఱచు

తే॥ హరిపదాంభోజయుగచింతనామృతమున నంతరంగంబు నిండినట్టెన నతడు
నిత్యపరిపూర్ణు డగుచు నన్నియును మఱచి జడత లేకయు నుండును జడువిభంగి

యని ప్రహ్లాదుని ఆంతరంగిక భక్తి వైభవమును పోతనామాత్యుడు వివరించెను.

ప్రహ్లాదుడు వైరాగ్యవంతుడు. భక్తి తత్పరుడు. ఎప్పుడు చూచినను అతని చిత్తము శ్రీహరి చరణకమలముల చెంతనే నిమగ్నమై యుండును. తన సంకల్పములు సత్య రూపుని పైననే యుండును. వాక్కులు వాసుదేవుని గూర్చియే వచించును. జీవితము సర్వదా జనార్దనునిదై యుండును. సదా ధ్యానమగ్నుడై యుండును. నిరంతరము దివ్య పారవశ్యమున దేలుచుండును. కూర్చుంటూ కృష్ణుని జూచును. నిలుచుంటూ నిరంజనుని ధ్యానించును. నడచుచూ నారాయణుని స్మరించును. పరుండునపుడు పద్మనాభుని పలకరించును. మాట్లాడునపుడు మాధవుడు ముందుండును. ఆలోచించగనే అనంతుడు అంతఃకరణలో అగుపించును. ముందు ముకుందుడుండును. వెనుక వెన్నుడుండును. దైనిక కృత్యములలో దైవమే గోచరించుచుండెను.

శా॥ పానీయంబులు ద్రావుచుం గుడుచుచున్ భాషించుచున్ హాసలీ
లానిద్రాదులు సేయుచుం దిరుగుచున్ లక్షించుచున్ సంతత
శ్రీనారాయణపాదపద్మయుగళీ చింతామృతాస్వాదసం
ధానుండై మఱచెన్ సురారిసుతుడే తద్విశ్వమున్ భూవరా!

మురారిని మరువలేని భక్తితో ఒకప్పుడు విలపించును. కొంతసేపు నినదించును. నవ్వును. పాడును. ఆడును. మాట్లాడును. మాట మానును. మ్రానువలె నిలబడును. ఎగురును. ఎలుగెత్తి పిలుచును. కదలిపోవు చుండును. కన్నీటితో ఊగిపోవుచుండును. స్నేహితులు గుర్తురారు. ఆకలి తెలిసిరాదు. పానీయము లర్థముగావు. నిద్రేమిటో ఊహకందదు. అంతా మరిచాడు. తనదంతా మైమరచినాడు. వింతగా తెలిసాడు. సదా విష్ణుచింతలో తేలాడు. మూర్ఖుడా? కాదు, భక్తిలో మునిగినవాడు. జడుడా? కాదు, శ్రీహరి పాదపద్మ సరోవరంలో జలకమాడిన వాడు. ఉన్మత్తుడా? కాదు, ఉత్కృష్ట పదవి నలంకరించినవాడు. సదా ప్రపంచమును మరచినవాడు. సర్వదా పరమాత్మనే దర్శించువాడు. పూర్ణభక్తుడు. పుణ్యశ్లోకుడు.

సీ॥ వైకుంఠచింతావివర్జితచేష్టుఁడై యొక్కడు నేడుచు నొక్కచోట
నశ్రాంతహరిభావనారూఢచిత్తుడై యుద్ధతుడై పాడు నొక్కచోట
విష్ణుఁ డింతియకాని వేఱొండు లేదని యొత్తిలి నగుచుండు నొక్కచోట
నలినాక్షు డను విధానము గంటి నే నని యుబ్బి గంతులు వైచు నొక్కచోట

ఆ॥ బలుకు నొక్కచోట బరమేశుఁ గేశవు బ్రణయహర్ష జనితబాష్పసలిల
మిళితపులకుడై నిమీలితనేత్రుడై యొక్కచోట నిలిచి యూరకుండు.

ముకుంద చరణారవింద సేవచే ప్రహ్లాదుడు సదా తన్మయుడై యుండును. కొఱత లేని ఆనందము ననుభవించు చుండును. ప్రాపంచిక విషయ సంసర్గమును క్షణమైనను భరించలేడు. అచ్యుతుని విషయమున అప్రమత్తుడై యుండును. బుధజన విధేయుడై మెలగుచుండును. పరమ భాగవత శ్రేష్ఠుడైన ప్రహ్లాదుడు కర్మబంధము లనెడి తీగలకు కొడవలి వంటివాడై యుండెను. ఆదిదేవుని నామము నుచ్చరింపగనే ఆనంద బాష్పము లను స్రవింపజేయు ప్రహ్లాదుని నడవడి సర్వులకు అవగతము గాకుండెను.

ప్రహ్లాదుని దివ్యపారవశ్య జనిత భక్తి ప్రాభవమును నారదునిద్వారా ఆలకించిన అజాత శత్రువునకు అపరిష్కృత సమస్యలు తలయెత్తెను. సందేహములు చుట్టుముట్టెను. సంశయములు చిత్తమును కలతపెట్టెను. ఇట్టి పరమ భాగవతోత్తముడైన ప్రహ్లాదుని, తండ్రియగు హిరణ్యకశిపు డెందులకు హింసించెనో అవగతము గాకుండెను. బిడ్డలు తప్పు చేసినను కాపాడుట పెద్దల విధి. తనయులు తెలియక తప్పుచేసినను తల్లిదండ్రులు సర్దుకొని జీవింతురు గదా! లేదా సరిజేయుదురు గదా! బిడ్డలపై తండ్రులు ప్రేమను జూపుదురే గాని, క్రౌర్యమును, శత్రుత్వమును ప్రదర్శించరు.

ప్రహ్లాదుడు పిల్లవాడు. పైగా సరళస్వభావుడు. సాధువులు సైతము కీర్తించు ఈ బిడ్డను బాధించుటకు అతనికి మనస్సెలా అంగీకరించెను? పైగా కరుణకు పాత్రుడైన బిడ్డను మరణమునకు గురిజేయుమని ఆజ్ఞాపించుటయా? ఎంత ఆలోచించినను అర్థం గాని ఈ విషయమును వివరముగా తెలుపుమని ధర్మరాజు నారదమహర్షిని ప్రశ్నించు చున్నాడని శుకబ్రహ్మ పరీక్షిన్మహారాజుకు చెప్పుచున్నాడు.

ఉ॥ బాలు బ్రభావిశాలు హరిపాదపయోరుహచింతనక్రియా
లోలు గృపాళు సాధుగురులోకపదానతఫాలు నిర్మల
శ్రీలు సమస్త సభ్యమతశీలు నిఖండితమోహవల్లికా
జాలు న దేల తండ్రి నడి జంపగ బంపె మునీంద్ర! చెప్పవే.

యని ధర్మరాజు నారదుని ప్రశ్నించెను. నారదమహర్షి చెప్పుచున్నాడు.

హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని హింసించుట

ప్రహ్లాదుని జూచి హిరణ్యకశిపుని మది కలతచెందెను. బిడ్డడు జడునివలె గన్పట్టు చున్నాడు. బుద్ధిమాంద్య మున్నట్లు తెలియుచున్నది. ఇతనిని చదివించుటయే ఉత్తమమని భావించెను. ఒకనాడు ముద్దులొలుకు ప్రహ్లాదుని చేరబిలిచి, "వత్సా! విద్యరానివాడు దేనికిని కొఱగాడు. విద్య విచక్షణ నిచ్చును. వెలుగు నిచ్చును. విద్య సర్వులకు వాంఛ నీయమే. నిన్ను ఉత్తములగు ఉపాధ్యాయుల వద్దకు పంపెదను. శ్రద్ధగా చదువుకొనుము. బుద్ధిగా మసలుకొనుము" అని పలికిన హిరణ్యకశిపుడు శుక్రాచార్యుని పుత్రులగు చండుడు, మర్కుడు అను వారలను గురువులుగా పిలిపించెను.

చండ మర్కులు అరుదెంచిరి. దైత్యరాజు వారితో ఇట్లనెను: "అయ్యా! ఈ పిల్లవాడు నా కుమారుడు. పేరు ప్రహ్లాదుడు. ఇతడొక విచిత్రమైన వాడు. అంధునివలె యున్నాడు. మాతో మాటలాడడు. నా పరాక్రమ సౌరభము ఇసుమంతైనను ఇతనికి అబ్బలేదు. మీరు మాకు మాన్యులు. ఆంతరంగికులు. పెద్దలు. దయామయులు. నా యందు కరుణ వహించి నా తనయునికి విద్య నేర్పి, విశిష్టునిగా జేయుడు" యనెను.

గురువులు ప్రహ్లాదుని వెంట బెట్టుకొని వెళ్ళిరి. సమవయస్కులైన రాక్షస బాలురను అతనికి తోడుచేసిరి. చెప్పవలసిన విద్యలన్నియు చెప్పిరి. వారు చెప్పిన విద్యల నన్నిటిని ప్రహ్లాదుడు చక్కగా నేర్చును. కానీ విష్ణుభక్తిని మాత్రము వదలకుండెను. గురువులు చెప్పిన దాని నాలకించునే గాని తిరిగి ప్రశ్నించి ఎరుగడు. శ్రీహరి తప్ప అన్యము లన్నియు అసత్యములే యని గుర్తించి యున్నందున, ఏది గురువులు చెప్పినను మారు పలుకక నేర్చుకొను చుండెను.

బాలుడు ఎలా చదువుచున్నాడో తెలిసికొనవలెనని కొన్నాళ్ళకు హిరణ్యకశిపున కనిపించెను. గురువులకు కబురుచేసెను. బాలుని తీసికొని రమ్మని చెప్పెను. గురువులు ప్రహ్లాదుని తీసికొని వచ్చిరి. తండ్రి బాలుని చూసి అపరిమితానందముతో ఊగిపోయెను. "నాయనా! కుమారా! రా! రమ్ము!" యని చేరబిలిచి తొడపై కూర్చుండ బెట్టుకొనెను.

"కుమారా! విద్యాభ్యాసము చక్కగా చేసితివా? శాస్త్రములు చదివితివా? ఏమేమి తెలిసికొంటివి? గురువులు నీకేమి బోధించిరి? తనయుల సంభాషణములను ఎన్నిసార్లు విన్నను తండ్రులకు తనివితీరదు. నిరంతరము ఆనందమునే కల్గించు చుండును. బిడ్డల మాటలు తండ్రులకు బాధలను తొలగించును. బడలికను పోగొట్టును. చిన్నారుల పలుకులే పెద్దల చెవులకు అలంకారములు. చిట్టితండ్రీ! నీవు గురువుల వద్ద నేర్చిన వానిలో నీకు వచ్చిన విషయమును వినిపింపుము" యనెను.

ప్రహ్లాదుడు చేతులు జోడించి తండ్రికి నమస్కరించుచు, "తండ్రీ! నేను గురువుల వద్ద ఎన్నో వింటిని. కానీ నా మనస్సుకు మాత్రము ఒక్క విషయము శ్రేష్ఠమని తెలియు చున్నది" యనగానే "వత్సా! చెప్పుము. ఆలసింపకుము. శ్రేష్ఠమేదియో తెలుపుము" యని హిరణ్యకశిపు డనెను. ప్రహ్లాదుడు నిమీలిత నేత్రుడై పలుకుచున్నాడు.

ఉ॥ ఎల్లశరీరధారులకు నిల్లను చీకటినూతిలోపలం
ద్రెళ్ళక మీరు నే మను మతిభ్రమణంబున భిన్ను లై ప్రవ
ర్తిల్లక సర్వము న్నతని దివ్యకళామయ మంచు విష్ణునం
దుల్లము జేర్చి తా రడవి నుండుటమేలు నిశాచరాగ్రణీ!

"తండ్రీ! సర్వులు గృహమనెడి చీకటి గోతిలో పడియున్నారు. "నీరు, వారు, నేను" యనెడి భేద భావములతో ప్రవర్తిల్లుచున్నారు. ఈ ద్వైత భ్రాంతిని వదలి సమస్తము విష్ణువు దేవుడే యని తెలిసికొని, ఆతనినే స్మరించుచూ అడవులలో చరించుట శ్రేష్ఠమని నా అభిప్రాయము" యనెను.

ప్రహ్లాదుని మాటల నాలకించిన హిరణ్యకశిపునకు ఆశ్చర్యమాయెను. "కుమారా! ఇది ఏమి చోద్యము? పిల్లలు ఎవరు ఏమి చెప్పినను, ఏది చెప్పినను, దానినే సత్యమని విశ్వసింతురు. ఎవరు నేర్పిరో గాని శత్రువుల కనుకూలమైన విద్యలను నేర్పినారు. నాయనా! ప్రహ్లాదా! ఈ జ్ఞానము నీకు స్వయంగా కలిగినదా? లేక నీకు మరెవ్వరైనను బోధించిరా? ఎలా వచ్చినను ఇది నేర్వదగినది కాదు. విష్ణువు రాక్షసద్రోహి. అతని పేరును తలచుట సముచితము కానేరదు. పిచ్చివానివలె హరి గిరి యనకు. ఆ మాటలను దరి జేరనీయకు" యని హిరణ్యకశిపు డనెను.

తండ్రి మాటల నాలకించిన తనయుడు గురువుల వంక జూచెను. వారు భయముతో వణకసాగిరి. ప్రహ్లాదుడు గురువులతో ఇట్లనెను:

"గురువర్యులారా! కొందరు మాయచే తాముని, పరులని భావించి భేదబుద్ధిని తయారు చేసికొందురు. అట్టివారు జ్ఞానమయుడైన పరమాత్మను వర్ణింపజాలరు. అసలు బ్రహ్మాది దేవతలే శ్రీహరి వైభవమును వర్ణింపలేక పోయిరి. ఇక సామాన్యుల విషయమేల? గురుదేవా! అది ఏమి చిత్రమో గాని నా మనస్సు మాత్రము శ్రీహరిని వదలి మనలేదు. సూదంటురాతిని ఇనుపముక్క తగుల్కొనినట్లు నా చిత్తము విష్ణుమూర్తి యందు దృఢమై యున్నది.

తే॥ ఇను మయస్కాంతసన్నిధి నెట్లు భ్రాంత మగు హృషీకేశు సన్నిధి నా విధమున
గరగుచున్నది దైవయోగమున జేసి బ్రాహ్మణోత్తమ! చిత్తంబు భ్రాంతమగుచు.

"నేను విష్ణుమూర్తిని వదలి జీవించలేను" యనెను.

ప్రహ్లాదకుమారుని మాటల నాలకించిన ఆచార్యులు మ్రింగుడు పడనివారై, "కుమారా! మేము చెప్పని ఈ విషయాలు నీకు చెప్పిందెవరు? నీ చిత్తమును విష్ణుని వైపునకు త్రిప్పినదెవరు? తప్పు నాయనా! విష్ణువును మరచిపొమ్ము! దైత్యరాజును పరమాత్మగా స్వీకరింపుము" యనిరి. విష్ణుదేవుని మరచుట తన కసాధ్యమని ప్రహ్లాదుడు బదులుపలికెను.

సీ॥ మందారమకరంద మాధుర్యమున దేలు మధుపంబు వోవునే మదనములకు
నిర్మల మందాకినీవీచికల దూగు రాయంచ సనునె తరంగిణులకు
లలిత రసాలపల్లవఖాదియై చొక్కు కోయిల సేరునే కుటజములకు
బూర్ణేందుచంద్రికా స్ఫురితచకోరక మరుగునే సాంద్రనీహారములకు

తే॥ నంబుజోదరదివ్యపాదారవింద చింతనామృతపానవిశేషమత్త
చిత్త మేరీతి నితరంబు జేరనేర్చు వినుతగుణశీల! మాటలు వేయునేల?

"గురుదేవా! కల్పవృక్షములలో పూదేనెలను త్రాగు భ్రమరము ఉమ్మెత్త చెట్ల వద్ద కరుదెంచునా? గంగాజలపుటలలలో జలకమాడు రాజహంస సామాన్య నదులవైపు నడక సాగించునా? తియ్యని మామిడి చిగుళ్ళను తినెడి కోయిలమ్మ కొడిసె చెట్లపైకి చేరునా? పున్నమినాటి చంద్రుని వెన్నెలను జుర్రుకొని మత్తెక్కిన చకోరము మంచుగడ్డల మీదికి

చేరునా? విష్ణుదేవుని దివ్య పాదారవింద ధ్యానమనెడి అమృతమును పానము చేసి మత్తెక్కిన మనస్సు ఇతర విషయముల పైకి ఎలా వెళ్ళగలదో చెప్పండి" యనెను.

ప్రహ్లాదుని మాటల నాలకించిన గురువు క్రుద్ధుడయ్యెను. ప్రహ్లాదుని జూచి, "ఓరి బాలకా! వైరి విభూషణా! వంశ దూషణా! నీవు ఐదేండ్ల బాలుడవు. ఇంతలేవు. కానీ అంత మాటలు, వింత మాటలు మాట్లాడుచున్నావు. వక్రములన్నీ వచించుచున్నావు. తర్కములన్నీ వలుకుచున్నావు. మేము శ్రమించి బోధించినవి ఒక్కటియైనా చెప్పవు. ప్రభువు ఎదుట మాకు తలవంపులు తెచ్చితివి. నీవు దానవరాజునకు పుత్రుడివా? శత్రువుయా?

దైతేయ చందనవనే జాతోఽయం కంటకద్రుమః
యన్మూలో న్మూల పరశో ర్విష్ణో ర్నాలాయితోఽర్భకః

"రాక్షసవంశ మనెడి చందనవనము నందు ఈ ప్రహ్లాదుడు కంటక వృక్షమువలె జన్మించినాడు. రాక్షస వంశమును నాశము చేయు విష్ణువనెడి గొడ్డలికి వీడు కఱ్ఱయై మిగిలాడు.

"రాజా! ఇతనిని దండించిన గాని దారిలోపడడు. ఈసారి నేర్పుగా చదివించగలము. నీ పాదముల సాక్షిగా చెప్పుచున్నాము. ఇతనిపై మేము కోపింతుము. ఈ సారికి మమ్ము లను కోపపడవలదు" యని పలికి ప్రహ్లాదుని తీసికొని వెళ్ళిరి.

భార్గవ నందనులగు చండ మర్కులు తమ చాతుర్యము కొలది బోధించిరి. ధర్మార్థ కామములను తెలిపిరి. సామ దాన భేద దండోపాయాలన్నీ బోధించిరి. నీతిజ్ఞుడైనట్లు భావించిరి. కొంతకాలము గడిచింది. తాము నేర్పిన విద్యలన్నీ బాలు డభ్యసించాడు. వాటిని రాజుగారి ముందు ప్రదర్శింప జేయాలని గురువులు భావించారు. ప్రహ్లాదుని పిలిచారు. "నాయనా! మీ తండ్రిగారి వద్ద కేగుచుంటిమి. ఈ సారి మా పరువును దక్కించుము. మేము చెప్పిన వర్గత్రయమును మరువకుము. మన శత్రువగు విష్ణుని గూర్చి ముచ్చటింపకుము."

ఉ॥ త్రిప్పకు మన్న మా మతము, దీర్ఘములైన త్రివర్గపాఠముల్
దప్పకు మన్న, నేడు మన దైత్యవరేణ్యుని మ్రోల నేము మున్
చెప్పినరీతి గాని మఱి సెప్పకు మన్న విరోధిశాస్త్రముల్,
విప్పకు మన్న దుష్టమగు విష్ణుచరిత్రకథార్థజాలముల్.

యని పలికి గురువులు ప్రహ్లాదుని దైత్యరాజు సన్నిధికి తోడ్కొని వచ్చిరి.

సదా మాధవ నామామృత మాధుర్యమును గ్రోలుచు ప్రహ్లాదుడు దేహమును మరచుచుండెను. బ్రహ్మాదుల కైనను సాధ్యపడని విష్ణుభక్తిచే పరవశించు చుండెను. నిఖిల లోకముల యందలి సకల మానవుల దైన్య జీవితములను పరిశీలించి, విష్ణువు కన్నను అన్యమైనది అవాంఛనీయ మైనదియేనని భావించి, బాగుగ నిర్ణయించి, విష్ణు ధ్యానములో ప్రవర్తిల్లు ప్రహ్లాదకుమారుని తోడ్కొని వచ్చి, మైమరచి నిలబడియున్న బాలకుని ముందుకు త్రోసి తండ్రికి నమస్కరింపుమని గురువు లనిరి.

క॥ శిక్షించితి మవ్యయము లగు పక్షంబులు మాని నీతిపొరగు డయ్యెన్
రక్షోవంశాధీశ్వర! వీక్షింపుము నీకుమారు విద్యాబలమున్.

అని చండ మర్కులు హిరణ్యకశిపునితో విన్నవించుకొనిరి.

హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని చూసెను. దండప్రణామము చేసిన బిడ్డను దీవించెను. చేతులను చాచి చేరదీసికొనెను. గాఢముగా కౌగలించుకొనెను. తొడపై కూర్చుండ బెట్టు కొనెను. ముంగురులను చేతితో దువ్వెను. గడ్డమును పట్టుకొని ముద్దాడెను. తలను మూర్కొనెను. ఆనందాతిశయముచే బాష్పములు నేత్రముల యందు నిలిచియుండ మెల్లని, తియ్యని మాటలతో ఇలా పలికెను:

"వత్సా! నిన్ను చూసి ఎంతోకాల మైనట్లున్నది. నీ సహాధ్యాయులు చక్కగా చదివి బుద్ధిమంతులై యున్నారు. నిన్ను విద్యావంతునిగ చూడవలె ననెడి నా కోర్కె నేడు నెర వేరినది. కుమారా! నీ విద్యల సారమును తెలియగోరు చున్నాను. నీవు చదివిన శాస్త్రము లలో ఒక్క శ్లోకమును వల్లించి, దాని భావమును పలికించి, తాత్పర్యమును ముందుం చుము" అనెను.

"నాన్నా! గురువులు నాకు చక్కగా బోధించినారు. చాలా శాస్త్రములను వారి వద్ద నేను అధ్యయనము చేసితిని. ఒక్క మాటలో చెప్పవలె నని చదువుల సారమంతటిని గ్రహించితిని."

క॥ చదివించిరి నను గురువులు చదివితి ధర్మార్థముఖ్యశాస్త్రంబులు నే
జదివినవి గలవు పెక్కులు చదువులలో మర్మమెల్ల జదివితి దండ్రీ!

యని ప్రహ్లాదుడు పలుకగా గురువులు సంతుష్టచిత్తులైరి. తండ్రియైన హిరణ్య కశిపుని ఆనందము అనిర్వచనీయ మాయెను.

"కుమారా! లెమ్ము! మాకు చాలా ఆనందముగా యున్నది. తులసివనములో గంజాయి మొలచునా? నా కడుపున జడుడు జన్మించునా! దైత్యవంశ వర్ధనుడవుగా నీవు నాకు గన్పించు చున్నావు. భళి భళి! నిన్ను ఈ స్థాయికి తెచ్చిన గురువుల శ్రమ ప్రశంస నీయమైనది. వారి ఋణము తీర్చలేనిది. వత్సా! ఏదీ శ్లోకమును చెప్పి, నా హృదయ మును ఆనంద డోలికలలో ఊగునట్లు చేయుము" యని హిరణ్యకశిపు డనెను. ప్రహ్లాదుడు శ్లోకమును చెప్పుచున్నాడు.

శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాద సేవనమ్
అర్చనం వన్దనం దాస్యం సఖ్య మాత్మ నివేదనమ్
ఇతి పుంసార్పితా విష్ణౌ భక్తి శ్చేన్నవ లక్షణా
క్రియతే భగవత్యద్ధా తన్మన్యేఽధీత ముత్తమమ్ ॥

"1. భగవంతుని నామ, లీల, గుణాదులను వినుట, 2. కీర్తించుట, 3. స్మరించుట, 4. పాదపద్మములను సేవించుట, 5. అర్చించుట, 6. నమస్కరించుట, 7. దాస్యము చేయుట, 8. స్నేహభావము, 9. ఆత్మ నివేదనము గావించుట అను ఈ తొమ్మిదియు

భక్తి లక్షణములు. ఈ తొమ్మిది విధములైన భక్తి సాధనలను విష్ణువునందు ఎవడు ఆచరించునో అతడే చక్కగా చదివినవాడని నా అభిప్రాయము" అని ప్రహ్లాదుడనెను.

దీనినే నవవిధ భక్తి యందురు. ఇందులో తొమ్మిది విధములైన భక్తి సాధనలున్నవి. నావ నెక్కినవాడు తీరమును చేరునట్లు ఈ భక్తి విధముల నెరిగినవాడు తప్పక తరించును.

నవవిధ భక్తి స్వరూపములు

1. శ్రవణము :- శ్రవణము జ్ఞానము నందించును. ఆత్మానాత్మ వివేక జ్ఞానము నందించును. శ్రవణము వలన సద్భావములు పెంపొందును. సదాచార మలవడును. సన్మార్గము తెలిసివచ్చును. సద్గతి లభించును.

హరి కథలు వినెడి వారికి మరణాగత మోహ సంభ్రమము లే దనఘా

యని భాగవతము నందే కలదు. భగవంతుని దివ్య చరిత్రమును, అనంతకళ్యాణ గుణములను ఆలకించుట శ్రవణ మనబడును.

శ్రవణము చేయుట వలన శౌనకాది ఋషులు నైమిశారణ్యమున జ్ఞానులైరి. శ్రవణము వలననే జనకచక్రవర్తికి జ్ఞానము కలిగెను. శ్రవణము వలననే పరీక్షిత్తుడు ముక్తిని బొందెను. ప్రబోధసమయముననే అర్హతగల ముముక్షువునకు జ్ఞానము లభించునని శంకరాచార్యులు తెలిపియున్నారు.

కథా త్రివేణీ సంగమ దేవభక్త్ ఆణి నామ తేథేంచె ఉత్తమ చరణ రజ వందితాం
జళతీ దోషాంచె డోంగర శుద్ధ హెూతీ నారీనర గాతీ ఏకతీ సాదర జె పవిత్ర హరి కథా!

"కథా శ్రవణము త్రివేణీ సంగమమువలె పవిత్రమైనది. దేవుడు, భక్తుడు, భగవన్నామములు ఒక్కచోట చేరుచున్నవి. భగవత్కథను, లీలలను వర్ణించుట కుపకరించు ఆ స్థలము పవిత్రమగుచున్నది. కారణము ఆ ప్రదేశము మహాత్ముల పాదధూళికి నోచుకొనుచున్నది. కథా శ్రవణము పాప పర్వతములను దహించివేయును. జనులందరిని పరిశుద్ధమొనర్చును. వక్తను, శ్రోతను పవిత్రము చేయును" అని సంత్ తుకారాం గానం చేశాడు.

2. కీర్తనము :- కీర్తన మనగా భగవంతుని వైభవమును గానము చేయుటయని భావము. కలియుగములో భగవన్నామ సంకీర్తనమే తరించుటకు ఏకైక తరుణోపాయమని శాస్త్రములు ఘోషిస్తున్నవి. మహాత్ములు ప్రవచిస్తున్నారు **"కలౌ సంకీర్త్య కేశవమ్"** అని విష్ణు పురాణము ప్రవచించినది.

గీత్వాతు మమ నామాని విచరే న్మమ సన్నిధౌ
ఇతి బ్రవీమితే సత్యం - క్రీతోహం తస్య చార్జున !

"అర్జునా! ఎవరయితే నా నామమును గానము చేయుచు, నా సన్నిధానము నందే యుందురో అట్టివారికి నేను ఋణపడి యున్నాను. ఇది సత్యము" అని భగవానుడు ఆదిపురాణము నందు చెప్పి యున్నాడు.

భజన పరులకేల దండపాణి భయము, మనసా
అజరుద్ర సురేశుల కాయాస్థాన మొసగు రామ ॥భజన॥

యని త్యాగరాజస్వామి మృత్యుంజయులై కీర్తించారు.

ఈ నవవిధ భక్తులలో మొదటిదైన శ్రవణమును విషయగ్రహణముగను, రెండవది యగు కీర్తనమును ఆచరణముగను గ్రహించిన ఇంకా సులభగ్రాహ్యమై భాసించును.

భగవద్గుణ శ్రవణ కీర్తనాత్ ॥

"భగవద్గుణ శ్రవణ కీర్తనాదుల వలన పరమాత్మను పొందవచ్చు" నని నారదమహర్షి భక్తి సూత్రములలో కూడా తెలిపియున్నారు.

3. స్మరణము :- శ్రవణములో భగవల్లీలలు తెలియును. వైభవము అర్థమగును. ఆ తరువాత కీర్తనములో గుణలీలలను గానముచేయుట, సాధన లాచరించుట జరుగును. కానీ భగవంతుని సదా మనస్సునందు నిలుపు కొనుటను స్మరణమందురు. నిరంతరము పరమాత్మను స్మరించే అలవాటును మనస్సునకు కల్పించాలి. పరమాత్మను స్మరించు మనస్సు పరమాత్మ యందే స్థిరపడి యుండును.

మా మనుస్మరత చిత్తం మయ్యేవ ప్రవిలీయతే

"నన్ను స్మరించు మనస్సు నా యందే విలీనమై యుండును" అని పరమాత్మ భాగవతము నందు తెలిపెను.

స్మర వారం వారం చేతః స్మర నందకుమారమ్

"చిత్తమా! మఱల మఱల నందకుమారుని స్మరింపుము" అని సదాశివ బ్రహ్మేంద్రస్వాముల వారు కీర్తించి యున్నారు.

4. పాద సేవనము :- భగవంతుని పాదపద్మములను సేవించుట నాల్గవ భక్తి క్రమము. గుహుని తరింపజేసినది, భరతునికి ముక్తినొసగినది, భగవానుని పాదపద్మములే కదా! అవియే అహల్యకు బ్రతుకునిచ్చిన చరణములు.

నీ పద పంకజములను నే నెర నమ్మినాను ॥నీ పద॥
కోపముతో ముని తాపసి ఇచ్చిన
శాపమున అహల్య అనుదినము
చాపరాయి తను తాప మోర్వలే
నామెను గని పరితాపము దీర్చిన ॥నీ పద॥

యని ప్రార్థించిన త్యాగరాజస్వామి రామసాయుజ్యము నొంది తరించాడు. అదియును గాక ఈ విశ్వము పరమాత్మ యొక్క పాదముగా పురుష సూక్తములో వర్ణించబడినది. కనుక జగత్తును జగదీశ్వర స్వరూపముగా నెంచి సేవచేయువారు కూడా ఈ పాదసేవన భక్తి క్రిందికి వస్తారు.

5. అర్చనము :- అర్చనమనగా పూజించుట యని భావము. భగవానుని అనంత స్వరూపమును ధ్యానించలేనివారు భగవానుని ప్రతిమలుగాను, విగ్రహములుగాను భావించి పూజించు చుందురు. ఇదియే అర్చనము. ప్రతి ఇంటిని దేవాలయముగా మార్చు క్రొత్త పద్ధతి ఈ అర్చనమందు గోచరించును.

పూజాది ష్వనురాగ ఇతి పారాశర్యః

పూజయందు అనురాగమును కలిగి యుండుటయే భక్తియని వ్యాసభగవానుని అభిప్రాయమును నారదమహర్షి భక్తి సూత్రాలలో తెలుపుతాడు.

సకృదపి యేన మురారి సమర్చా క్రియతే తస్య యమేన న చర్చా

శ్రీహరి నర్చించు వారికి యమునితో వాదముండదని ఆదిశంకరులు భజగోవిందంలో తెలువుతారు. అర్చన సాధనసోపానములలో మొదటిది. పూజలో దేహేంద్రియ మనో బుద్ధులు శీఘ్రముగా నిగ్రహింపబడును. పూజచేయు సాధకుడు ఒకేమూర్తిని అర్చింపవలెను. సర్వమూర్తులలో ఆ మూర్తినే దర్శింపవలెను.

6. వందనము :- అర్చనము తర్వాత వందనము చెప్పబడినది. భగవద్గీత యందు కూడా శ్రీకృష్ణపరమాత్మ ఈ క్రమమునే తెలియపరచినాడు.

మద్యాజీ మాం నమస్కురు

"నన్ను అర్చించు. నాకు నమస్కరించు" అని భగవానుడు రాజవిద్యా రాజగుహ్య యోగము నందు మరియు మోక్ష సన్యాసయోగము నందు కూడా తెలిపియున్నాడు.

నమ ఇతి ద్వే అక్షరే

"నమ" యనునవి రెండు అక్షరములు. **"మ"** యనునది అహంకారము. **'న'** యనగా లేదు యని భావము. **"నమః"** యనగా అహంకారము లేదు యని అర్థము. అహంకారి భగవద్భక్తుడు కాలేడు. ఆలయానికి వెళ్ళినా అహంకారి సాష్టాంగ నమస్కారం చేయడు. తల నొక్కదానినే ఊపుతాడు. అట్టివాని విషయంలో భగవానుడు చాలా జాగ్రత్తగా ఆలోచిస్తాడు. ఇతడికి పొరపాటున చేతులిచ్చాను. ఇతనికి తలనూపే లక్షణమున్నది. కనుక వచ్చే జన్మలో అలాంటి రూపమునే ఇచ్చెద ననుకొనును.

నమస్కారము వలన అక్రూరుడు తరించెను. విభీషణుడు రామునికి శరణాగతుడై నమస్కరించెను. వందన మెరిగినవారు ఎప్పుడూ వందనీయులే.

7. దాస్యము :- దాస్యమనగా పరమాత్ముని సేవల యందు మనస్సు లగ్నమొనర్చుట. దాసుడు ధన్యుడు. దాసునికి బాధ్యతలు లేవు. బరువులు లేవు. దాసుని బరువులన్నియు దేవుడే భరించును.

దంసయతే స్వామి కార్యాణి సావధానే నేతి దాసః

స్వామి సేవలను అవధానముతో చేయువాడు దాసుడు. అందుచేతనే "నేను రాముని దాసుడను" అని ఆంజనేయుడు చెప్పుకొనెను. ప్రతి భక్తుడు భగవంతుని ఎదుట "దాసోఽహం తవ దాసోఽహం" యని పలుకును.

దాసత్వము అహంకారమును నిర్మూలించును. కర్తృత్వమును హరించును. భోక్తృత్వమును ప్రసాదరూపముగా మార్చును. అశాంతిని కలిగించదు. ప్రశాంతతను అందించును. నిత్యతృప్తి, నిరాశ్రయ జీవనము లభించును. భీతిని హరించును. కీర్తిని సంపాదించును. దాసుడు పరమాత్మ చేతిలో పరికరమై, చివరగ ముక్తి నొంది తరించును.

8. సఖ్యము :- సఖ్యమనగా స్నేహము. సఖ్య భక్తిలో భగవంతునితో భక్తునకు సఖ్య మేర్పడు చున్నది. స్నేహములో స్నేహితుని గుణములు మన కబ్బునట్లు, సఖ్య భక్తిలో పరమాత్మ లక్షణములను భక్తుడు పొందగలుగు చున్నాడు. రాధ శ్రీకృష్ణుని గూర్చి చింతించుచూ తానే శ్రీకృష్ణుడని ఒక దశలో భావించింది. ఇది సఖ్యభక్తి యొక్క పూర్ణ ఫలము.

అర్జునుడు, సుగ్రీవుడు, కుచేలుడు, గుహుడు ఇత్యాది మహాత్ములందరు సఖ్యభక్తి ద్వారానే తరించిరి. పరమాత్మ మనతో స్నేహము చేయునా? యనెడి సందేహము కలుగవచ్చును. అదియే భగవంతునిలోని సౌశీల్యము. ఇచ్చట మన స్నేహమును వృద్ధి నొందించునది మన అర్హతకాదు. పరమాత్మ కృప. విశ్వసించి జీవించుటయే వ్యక్తి అర్హతయై యున్నది. అసలు సౌశీల్య మనెడి పదమునకు అర్థమును గ్రహించినచో మనము సఖ్యమును అర్థము చేసికోగలము.

మహతః మందై స్సహ నీరంధ్రేణ సంశ్లేషః సౌశీల్యమ్

జాతి చేతను, ఐశ్వర్యము చేతను, జ్ఞానము చేతను శ్రేష్ఠుడైనవాడు తక్కువైన వానిలో భేదము లేకుండా కలసి యుండుటయే సౌశీల్యము.

హరిరసమ విహారి సతు సరసోయం మమ శ్రమ సంహారీ॥

"భగవానుడు రసమయుడు. సరసుడు. నా శ్రమలను పోగొట్టెడివాడు" అని అన్నమయ్య సంస్కృత కీర్తనలో గానం చేశాడు.

9. ఆత్మ నివేదనము :- సంపూర్ణ శరణాగతియే ఆత్మనివేదనము. ఇట్టి శరణాగతి భక్తిని పుష్టివంతము చేయును. ఆత్మ నివేదనాసక్తి గల భక్తుడు భగవంతుని భావములకు అనుకూలముగా జీవించును. ప్రతికూలమైన వానిని త్యజించును. భగవంతుడు తప్పక రక్షించుననెడి విశ్వాసమును కలిగియుండును. రక్షించేటందులకు అన్యులు లేరని భావించును. ఈ విధముగా తననే సంపూర్ణముగా సమర్పించుకొని యుండును. ఇదియే పూర్ణ శరణాగతి. ఇదియే ఆత్మ నివేదనము.

భవసాగర్ సంసార్ అపర్‌బల్ జామే తుమ్ హొ జహాజ్

నిరాధారాం ఆధార్ జగత్ గురు తుమ్ బిన హొయ్ అకాజ్

"భయంకరమైనది భవసాగరము. నీవే నావవై మమ్మ తీరమును జేర్పుము. ఓ జగద్గురు! శ్రీకృష్ణా! నిరాధారులకు నీవే ఆధారము. నీవే శరణ్యము" యని మీరాబాయి గానం చేసింది.

ఈ తొమ్మిది విధములైన భక్తి విషయములను ఎవ్వడు పూర్ణముగా నెరిగి ఆచరించునో వాడే విద్యావంతుడని ప్రహ్లాదుడు తండ్రితో చెప్పెను.

"తండ్రీ! విష్ణుభక్తి లేనివాని వ్యర్థ సంసారము గ్రుడ్డివానికి వెన్నెలవంటిది. చెవిటి వానికి శంఖధ్వని వంటిది. మూగవానికి శాస్త్రార్థముల నెరింగించుట లాంటిది. బూడిదలో హోమము వంటిది. లోభివాని సంపద వంటిది. పందికి పన్నీరు వంటిది. నాన్నా! నారా యణుని సేవ కుపయోగించని దేదైనను వ్యర్థమేనని నా అభిప్రాయము.

సీ॥ కమలాక్షు నర్చించు కరములు కరములు శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకుని జూచు చూడ్కులు చూడ్కులు శేషశాయికి మ్రొక్కు శిరము శిరము
విష్ణు నాకర్ణించు వీనులు వీనులు మధువైరి దవిలిన మనము మనము
భగవంతు వలగొను పదములు పదములు పురుషోత్తముని మీది బుద్ధి బుద్ధి
తే॥ దేవదేవుని జింతించు దినము దినము చక్రహస్తుని బ్రకటించు చదువు చదువు
కుంభినీధవు జెప్పెడి గురుడు గురుడు తండ్రి! హరి జేరుమనియెడి తండ్రి తండ్రి.

"తండ్రీ! విష్ణుదేవుని పూజించునవియే చేతులు. శ్రీనాథుని వర్ణించునదియే నాలుక. హరిని దర్శించునవియే కన్నులు. భగవంతునికి మ్రొక్కునదియే మస్తకము. భగవత్కథ లను శ్రవణము చేయునవియే చెవులు. హరియందు నిలచినదియే మనస్సు. భగవంతుని చుట్టు తిరుగునవియే పాదములు. పరమాత్మతో ఐక్యమగునదియే బుద్ధి. ఆయన ధ్యానము సాగినదియే సుదినము. భగవంతుని తెలుపునదియే చదువు. విష్ణువును గూర్చి బోధించువాడే గురువు. శ్రీనాథుని జేరుమని చెప్పువాడే తండ్రి."

పరమాత్మను పొందేందుకు మానవజన్మ లభించినది. దేహేంద్రియ మనోబుద్ధులు పరమాత్మ సేవనము నందే వినియోగపడాలి. భక్తిలేని జీవితము నిరర్థకము. శూన్యము. మన జీవితమంతా పరమాత్మతోనే ముడిపడి యున్నది. ఆయనకు దూరమైన క్షణాన జీవితమే సమాప్తమగును. ఈ విషయమును గూర్చి మానవుని బుద్ధి ఆలోచించుటలేదు. మనం భుజిస్తాము. పరమాత్మ దానిని జీర్ణింపచేస్తాడు. భుజించిన తరువాత మనము నిద్రిస్తాము. పరమాత్మ మనలను నిద్రలేపుతాడు. ఇవన్నీ మనిషి ఆలోచించడు. కుక్షింభరిత్వమునకే ప్రయత్నించు చుండును. విషయవాసనా లోలుడై, చరించుచుండును. అట్టి అదృష్టహీనుని మానవుడని పిలువ నవసరం లేదనియు, పశుసమానుడే ననియు ప్రహ్లాదుడు తండ్రితో చెప్పుచున్నాడు.

సీ॥ కంజాక్షునకు గాని కాయంబు కాయమే పవనగుంఫితచర్మ భస్త్రిగాక
వైకుంఠు బొగడని వక్త్రంబు వక్త్రమే ఢమఢమధ్వనితోడి ఢక్కగాక
హరిపూజనము లేని హస్తంబు హస్తమే తరుశాఖనిర్మిత దర్విగాక
కమలేశు జూడని కన్నులు కన్నులే తనుకుడ్యజాలరంధ్రములు గాక
చక్రిచింతలేని జన్మంబు జన్మమే తరళసలిలబుద్బుదంబు గాక
ఆ॥ విష్ణుభక్తిలేని విబుధుండు విబుధుడే పాదయుగముతోడి పశువు గాక.

పరమాత్మ సేవకు ఉపయోగపడినపుడే చేతులను చేతులుగా, చెవులను చెవులుగా భావించాలని చెప్పిన ప్రహ్లాద కుమారుడు అలా ఉపయోగపడని దేహేంద్రియాల నేమను చున్నాడో చూచెదము. ప్రహ్లాదుడు తండ్రితో చెప్పుచున్నాడు:

"తండ్రీ! కమలలోచనుడైన విష్ణుమూర్తికి ఉపకరించని దేహము దేహముకాదు. అది గాలి నిండిన తోలుతిత్తి. శ్రీహరిని కీర్తించని నోరు నోరుగాదు. అది శబ్దము చేయు తోలువాద్యము. శ్రీనాథు నర్చించని చేయి చేయికాదు. అది ఒక కొయ్యతెడ్డు. నారా యణుని దర్శింపని నేత్రములు నేత్రములు కావు. అవి దేహమనే గోడలో కిటికీల వంటివి. పరమాత్మను ధ్యానింపని బ్రతుకు బ్రతుకుకాదు. అదొక నీటిబుడగ. విష్ణుభక్తి లేని పండితుడు పండితుడు కాడు. రెండు పాదములతో చరించు పశువుయే."

"తండ్రీ! నా మాట నాలకింపుము. విష్ణుసేవ లేనిదే సంసార మేఘములు విచ్ఛిన్నం కావు. దైవసేవ యనెడి వర్షము లేనిచో తాపత్రయ మనెడి అగ్నులు చల్లారవు. విష్ణుభక్తి యనెడి సూర్యరశ్మి రానిచో ఇక్కట్లనే చీకట్లు చెదరిపోవు." ఈ విధంగా వెఱపు తెలియక, మఱపు నెరుగక మాటలాడు చిన్నవాని పెద్దమాటల నాలకించి, పెదవులు వణకుచుండ, నేత్రము లెఱ్ఱబడగా గురుపుత్రుడగు చండునితో హిరణ్యకశిపుడు ఇలా పలికెను:

"ఓరీ దుష్టుడా! బాలునికి విద్యలు చెప్పెదనని గొనిపోయి విరోధి స్తోత్రములు నేర్పించి తెచ్చితివా? గురుపుత్రుడవని మోసపోయితిని. నన్ను మోసము చేసి నా బిడ్డను మందమతిని చేసినావు. నీవు బ్రాహ్మణుడవేనా?

సన్తి హ్యసాధవో లోకే దుర్మైత్రాశ్ఛద్మ వేశినః
తేషా ముదేత్యఘం కాలే రోగః పాతకినా మివ

"బ్రాహ్మణాధమా! పాపముచేసిన వారి రోగములు కాలములో బహిర్గత మగునట్లు, కుటిలురు, దుష్టులు, అసాధువులు నగు ఎందరో వ్యక్తులు స్నేహితులగుచుందురు. కాలక్రమమున కార్యముల ద్వారా వీరి ద్వేషాదులు బయటపడును" అని హిరణ్యకశిపుడు క్రుద్ధుడయ్యెను. ఆ మాటలకు ఆచార్యుడు సమాధాన మొసంగెను.

"దానవేంద్రా! మేము మీకు శత్రువులము కాము. మేము మీకు మిత్రులము. పురోహితులము. పాత్రులము. మీ పాదములపై ప్రమాణముచేసి చెప్పుచున్నాము. మా వలన ఏమియును తప్పులేదు. మేము దుర్బోధలు చేయలేదు. మేమేగాదు. మరొకరు

కూడా చెప్పలేదు. అతనిలో గోచరించు ఈ విష్ణుభక్తి స్వభావసిద్ధమై యున్నది. మమ్ములను నిందించి ప్రయోజనములేదు. మా ప్రయత్నములు దోషము లేకుండా మేము చేసినాము" యని మారు పలికెను.

"ఓరీ బాలకా! నా పుత్రుడవైన నీకు ఈ బుద్ధి ఎలా కలిగింది? గురువులు చెప్పని విద్య నీకు ఎలా అలవడినది? వారెవరో నాకు చెప్పుము."

క॥ ఒజ్జలు సెప్పని యీమతి మజ్ఞాతుడవైన నీకు మఱి యెవ్వరిచే
నుజ్ఞాత మయ్యె బాలక! తజ్జనులం బేరుకొనుము తగ నా మ్రోలన్.

అని హిరణ్యకశిపుడు గద్దించెను. ప్రహ్లాదుడు ప్రత్యుత్తర మిచ్చుచున్నాడు:

"తండ్రీ! అజ్ఞానాంధకారములో పరిభ్రమించుచు, విషయలోలురై, మాటి మాటికి చావుపుట్టుకల వలలో తగులుకొనుచు, వ్యర్థమగువారికి హరిప్రబోధములు తమంతట తమకు లభించునా? ఇతరులు చెప్పిన వంటబట్టునా? కానలకేగిన కన్పించునా? ఈ ప్రపంచములో ఎక్కువమంది అంధపరంపర న్యాయము పగిది కర్మవలయంలో చిక్కుకొని విష్ణుని తెలియలేకున్నారు. విష్ణుదేవుని పాదధూళిచే పవిత్రమైనవారు మాత్రమే విష్ణుపదమును చేరగలుగు చున్నారు.

"నాన్నా! ఈ లోకములోని ఎన్నో శాస్త్రములను పఠించినాను. ఈ సంసార మొక భయంకర సముద్రము. ఇందులో పీకి తినివేయు భార్యాబిడ్డలనే జలచరములున్నవి. తీవ్రమైన వాంఛలు, గర్వము, క్రోధ మనెడి పెద్దలలలతో అది నిండి యున్నది. తండ్రీ! అట్టి భయంకర సాగరమును విష్ణుభక్తి యనెడి నావనెక్కి దాటవచ్చును. దుర్బుద్ధి వలన దాటతరమా?" యని ప్రహ్లాదుడు పలుకగా హిరణ్యకశిపుడు తన తొడపై కూర్చొనియున్న ప్రహ్లాదుని క్రిందపడనైచి, మంత్రులతో ఇలా పలికెను:

"సచివులారా! చూచితిరా! తన పినతండ్రిని పందిరూపముతో సంహరించిన ఆ మాయావి యగు విష్ణువునకు వీడు బంటువైనాడు. వీనికి సిగ్గులేదు. నాతో వైరమునకు దిగినాడు. ఇలా వినాశమును వరించుచున్నాడు. ఇలాంటి పాపిని, పితృద్రోహిని ఈ భూమిపై మీరెచ్చట నైనను గాంచితిరా?

"మంత్రులారా! వీడు అయిదేండ్ల కుఱ్ఱవాడు. తండ్రినైన నన్ను ధిక్కరించాడు. నా శత్రువైన విష్ణువును పొగడుచున్నాడు. వద్దంటే వినడు. ఇక చింతించిన ప్రయోజనముండదు. వీడు నా కుమారుడు కాడు. నా దేహమున బిడ్డ డనెడి పేరుతో పుట్టిన వ్యాధి. వీనిని వధించుటయే తక్షణ కర్తవ్యము.

"రాక్షసవీరులారా! దేహములో చెడిపోయిన అంగమును వైద్యుడు శస్త్రచికిత్సచేసి తీసి వేయునట్లు, కులనాశకుడు, నీచుడు నైన ఈ దుర్మతిని వధించి కీర్తిమంతుడనై తిరిగెదను. నా కులమును పవిత్ర మొనర్చుకొందును.

క॥ హంతవ్యుడు రక్షింపను మంతవ్యుడు గాడు యముని మందిరమునకున్
గంతవ్యుడు వధమున కుప రంతవ్యుం డనక చంపి రం డీ పడుచున్.

"వీడు చంపదగినవాడే గాని రక్షింప దగినవాడు కాడు. యమపురి కంపదగినవాడే గాని విడువ దగినవాడు కాడు. వెంటనే చంపి రండి" యనెను.

రాక్షసులందరు ఒకటై ప్రహ్లాదుని మీది కురికిరి. ఖడ్గములను చేతధరించి కుఱ్ఱవానిని హింసింప మొదలిడిరి. నిర్దయులై, క్రూరముగా కొట్టినారు. ఖడ్గములతో పొడిచినారు. అయినా శరీరము నుండి నెత్తురు కారుటలేదు. ఎముకలు విఱుగుటలేదు. చూపులో మార్పులేదు. మొగము వాడలేదు. భక్తి ఓడిపోలేదు. రాక్షసులు ఖడ్గములచే బాధించుచుండిరి. కానీ ప్రహ్లాదునకు ఆ ఖడ్గములో శ్రీహరి గోచరించు చుండెను. ప్రహ్లాదుడు శ్రీహరికి చేతులెత్తి నమస్కరించు చుండెను. పరమాత్మనే పలకరించు చుండెను.

ఉ॥ తన్ను నిశాచరుల్ వొడువ దైత్యకుమారుడు మాటిమాటి కో
పన్నగశాయి! యోదనుజభంజన! యోజగదీశ! యోమహా
పన్నశరణ్య! యోనిఖిలపావన! యంచు నుతించు గాని తా
గన్నుల నీరు దేడు భయకంపసమేతుడు గాడు భూవరా!

రాక్షసులు ఒకవైపు తనను పొడవసాగిరి. కొట్టసాగిరి. మాటి మాటికి ప్రహ్లాదుడు, "శ్రీహరీ! శ్రీధరా! నారాయణా! పన్నగశయనా!" యని అనునేగాని కన్నీరు పెట్టుకోడు. భయపడడు. వణకడు. కొట్టరాగా చేతులడ్డుపెట్టడు. తండ్రిని నిందింపడు. రక్షింపుమని ఎవ్వరినీ యాచించడు. బాధపడడు. దీనికి కారణమేమిటో దైత్యరాజగు హిరణ్యకశిపునికి అంతుబట్టలేదు.

దిగ్గజములచే త్రొక్కించెను. గజమునందు ప్రహ్లాదునకు శ్రీహరి దర్శనమిచ్చెను. పాములచే కరిపించెను. ప్రహ్లాదునకు క్షీరసాగరముపై తేలియాడు శేషశాయి వరము లిస్తున్నట్లు దర్శనమాయెను. నిప్పులలో త్రోయించెను. విషము పెట్టించెను. కొండలపై నుండి త్రోయించెను.

ప్రహ్లాదుడు చలింపలేదు. అతని దృష్టిలో నారాయణుడే కన్పించుచుండెను. దృష్టిని శుద్ధిచేసి కొనిన వానికి సృష్టి మంగళకరమే యగును. కామదృష్టి లోపించిన వానికి జగత్తు జగదీశ్వరునిగ తెలియును. ప్రపంచము అందముగా తెలియువానికి పరమాత్మ తెలిసి రాడు. ఏకవస్తు దర్శనములో శోకమోహాదులుండవు, భయభ్రాంతులు తెలియవు.

న సుఖేన, న దుఃఖేన, న గుణేన, న దోషేణ వాలిప్యతే।
బ్రహ్మవిత్ యో బ్రహ్మ నిష్ఠః శరీరం పృథ గ్విజానాతి।
ఆత్మైవైతస్య ధనమ్ యోజు సర్వంచ। స
సర్వథా శరీరం విస్మృత్య క్రియతే। స నిత్య మాత్మని పరితుష్టః

"దేహ సంబంధమును విడచి, బ్రహ్మమునందు మనస్సును విలీన మొనర్చిన వానికి సుఖదుఃఖాలు తెలియవు. గుణదోషము లుండవు. ఆత్మయే అతని బలము. ఆత్మయే అతని ధనము. దేహధ్యాస లేనందున అతడు సదా ఆత్మధ్యానము నందే యుండును" అని బ్రహ్మరహస్యోపనిషత్తు వల్కినది.

ఎన్ని విధముల దైత్యరాజు హింసించినను భక్తుడైన ప్రహ్లాదుడు సంహరింపబడుట లేదు. అంతకంతకు తేజోవంతముగా గన్పట్టుచుండెను. ఇతనిని వధించు టెట్లో హిరణ్యకశిపునకు అర్థంకాలేదు. దైత్యరాజు విచారపడసాగెను.

చండ మర్కు లరుదెంచిరి. రాజును శాంతింప యత్నించిరి. వయస్సు పెరిగిన కొలది ప్రహ్లాదునిలో మార్పు వచ్చుననియు, తమ తండ్రి శుక్రాచార్యుడు రాగానే ఇతనిని సన్మార్గములో పెట్టుననియు తెలిపిరి. వారి మాటల నాలకించిన దానవేంద్రుడు ప్రహ్లాదునకు ధర్మార్థకామంబుల నెరింగించమని చెప్పి, వారి వెంట పంపెను.

ప్రహ్లాదుడు బాలుర కుపదేశించుట

గురువులు త్రివర్గములను బోధించు చుండిరి. బోధకుల చిత్తము రాగద్వేష పంకులమై యున్నందున ప్రహ్లాదుడు వారి బోధను పట్టించు కొనెడివాడుకాడు. గురువులు ఇంటలేని సమయాన సమవయస్కులగు బాలురు ప్రహ్లాదుని క్రీడలకై ఆహ్వానించెడివారు. ప్రహ్లాదుడు నవ్వుచూ వారికి బోధించు చుండెడివాడు.

పిల్లల చిత్తములింకా రాగద్వేష యుతములు కాలేదు. అందుచేత ప్రహ్లాదుని దివ్య బోధను శ్రద్ధతో వినగలుగుచున్నారు యని శుకుడు పరీక్షిత్తునకు చెప్పుచున్నాడు.

ఉదయమువనే చిలికిన వెన్న శ్రేయము నొనగూర్చును. పుష్టి నిచ్చును. బాల్యమున అలవడిన భక్తియే పవిత్రమై యుండును. కొందరు వయస్సు మళ్ళిన తరువాత భక్తిలో ప్రవేశిస్తారు. సత్పురుషుల నాశ్రయిస్తారు. దుష్ప్రచారాలు సాగిస్తుంటారు. ఆశ్రమాల నాశ్రయిస్తారు. అలజడులు సృష్టిస్తారు. ఆధిక్యతలకు ప్రయత్నిస్తారు. పేరు ప్రఖ్యాతులను ఆశిస్తారు. సరైతే సంతోషిస్తారు. సరిపడి యుంటారు. బెసిగితే విసిగిపోతారు.

బాల్యములో భక్తి కుదిరినవారు ధన్యులు. వారికి రాగద్వేషాలుండవు. అహంకారము అర్థంగాదు. అభిమానముండదు. ప్రేమతో చరిస్తుంటారు. త్యాగులై జీవిస్తుంటారు. బాధ లున్నవారిని అర్థం చేసుకుంటారు. ఈర్ష్యాసూయలను దగ్గరకు రానివ్వరు. ప్రహ్లాదుని బోధలు పెద్దలకు పట్టలేదు. గిట్టలేదు. అజ్ఞానము ముట్టనందున బాలురు పట్టించుకో గలిగారు. ప్రహ్లాదుడు బాలుర కుపదేశించుచున్నాడు.

"మిత్రులారా! మన ఆచార్యుడు మనకు ఒక్కటైనను మంచి విషయమును చెప్పడు. ఎప్పుడూ కర్ణకఠోరమైన కర్మల విషయమునే వివరించును. నేను మీకు మంచి విషయము లను చెప్పెదను. అవి మీకు చాలా ఆనందము విచ్చును" అని ప్రహ్లాదుడు పలుకగా పిల్లలందరు దైత్యకుమారుని చుట్టు గుమిగూడి ఉత్సాహముతో ఆలకింపసాగిరి.

ప్రహ్లాదుడు చెప్పుచున్నాడు: "మిత్రులారా! మన వయస్సుగల బాలురెందరో చని పోవుచుండుటను మనము గాంచుచునే యున్నాము. కానీ మన ఆచార్యుడు అనిత్యమైన విషయములను గూర్చియే మనకు బోధించుచున్నాడు. విషయసుఖాలు అనిత్యములు. వానికై మనము ప్రయత్నించ కూడదు.

తత్ప్రయాసో న కర్తవ్యో యత ఆయుర్వ్యయః పరమ్
న తథా విన్దతే క్షేమం ముకుంద చరణాంబుజమ్

"ఈ విషయసుఖాలు ప్రయాసతో కూడినవి. ప్రయత్నించి పొందదగినవి కావు. అట్టి ప్రయత్నమువలన ఆయువు నశించును. ముకుందుని చరణారవింద సేవనమునందు లభించు ఆనందము విషయములలో లభించదు."

బాల్యము నుండియే చిత్తము భజనలో నిమగ్నము కావలెనని ప్రహ్లాదుడు పలుకు చున్నాడు. ఇంకనూ చెప్పుచున్నాడు:

"మనుజుడు వందసంవత్సరముల ఆయువును పొందియుండును. అందు సగభాగము నిద్రయందు గడచును. పదిసంవత్సరములు బాల్యచేష్టలలో కారిపోవును. పదిసంవత్సర ములు ఆటలలో సాగిపోవును. ముసలితనములో ఇరువది సంవత్సరములు వృథాయగును. మిగిలిన కొద్దికాలమును విషయ సుఖాభిలాషలో గడుపుచున్నాడు. ప్రశస్తమైన మానవ జన్మను వ్యర్థము చేయుచున్నాడు," సంసారమునందలి దోషములను ప్రహ్లాదుడు తెలుపు చున్నాడు.

సంసార దోష దృష్ట్యైవ విరక్తి ర్జాయతే సదా

"సంసారము నందలి దోషములను దర్శించుటద్వారా వైరాగ్యమేర్పడును" యని నారదపరివ్రాజకోపనిషత్తు తెలిపినది.

శరీరము అనిత్యము. అయినను నిత్యుడైన పరమాత్మను పొందుటకు ఉపకరించును. ఇట్టి ధర్మక్షేత్రమైన శరీరము శిథిలము గాక మునుపే, వృద్ధాప్యము ప్రాప్తించక మునుపే పరమాత్మ దర్శనానికి తీవ్రంగా ప్రయత్నించాలి. కాని మనుజులు ఈ ప్రయత్నముచేయక బ్రతుకును వమ్ము చేసికొనుచున్నారు.

"బాలకులారా! పట్టుపురుగు గూడును నిర్మించుకొనును. అది బయల్వెడలుటకు కూడా ఖాళీలేకుండా గూడును మూసివేసి దానియందే మరణించును. జనులు కూడా విషయ వాసనాభిలాషులై ఈ ప్రపంచగూటిలో తగుల్కొని నిహతులగుచున్నారు" అని ప్రహ్లాదుడు చెప్పసాగెను.

కుటుంబమునందు ఎవరికి ఆసక్తి మెండుగా యుండునో అట్టివానికి కుటుంబ రక్షణ యందే ఆయుష్షు వ్యయమగును. ఈ సత్యమును అతడు గ్రహించడు. ఈ ప్రపంచములోని ప్రతి ఆకర్షణ మనలను మృత్యుముఖంలో పడదోసేదియేయని గ్రహించాలి. సంసారమును త్యజించినవారే సుఖింతురు. ఇది మనకు శ్రేయము నొనగూర్చదు. దీనివలన కీర్తియును లేదు. చావు పుట్టుకలు లేని మార్గమును మనము అన్వేషింపవలెను. ఈ విధముగా ప్రహ్లాదుడు బోధించసాగెను.

ఆ॥ విషయసక్తులైన విబుధాహితులతోడి మనికి వలదు ముక్తి మార్గవాంఛ
నాదిదేవు విష్ణు నాశ్రయింపుడు ముక్త సంగజనుల గూడి శైశవమున.

"స్నేహితులారా! నా మాట వినుడు. బాల్యముననే దైత్యులతో గూడి చెడిపోవుట కన్నను, సంగరహితులైన మహాత్ముల నాశ్రయించి వారిని సేవించి, విష్ణుపదమును బొందుడు" అని తెలిపెను. ప్రహ్లాదుని వచనముల నాలకించిన బాలురు ఇట్లు పలికిరి:

"ప్రహ్లాదకుమారా! మనమంతా సమ వయస్కులము. పైగా ఒక్కచోటనే పుట్టిన వారము. అందరము ఒకే ఆచార్యునివద్ద విద్య నార్జించితిమి. ఈ వింతయైన జ్ఞానము నీకెలా అలవడినది? ఈ జ్ఞానమును నీకు బోధించిన మహితాత్ము డెవరు? మాకు దయ చేసి తెలుపుము" అనిరి.

క॥ సేవింతుము ని న్నెప్పుడు భావింతుము రాజ వనుచు బహుమానములం
గావింతుము తెలియము నీ కీ వింతమతిప్రకాశ మే క్రియ గలిగెన్.

అని బాలురు ప్రహ్లాదుని ప్రశ్నించిరి. వారి మాటల నాలకించిన ప్రహ్లాదుడు "పూర్వము నేను ఈ జ్ఞానమును నారదమహర్షి వద్దనుండి వినియుంటిని. భగవత్ప్రీతి కరమైన భాగవత ధర్మమును శ్రవణము చేసియుంటిని" అనెను.

"ప్రహ్లాదా! మనము ఈ గురువుల వద్దనే విద్య నభ్యసించితిమి. మీ అంతఃపురము లోనికి నీకు చెప్పుటకు మీ తండ్రి ఎవ్వరినీ అంగీకరించడు. మరి నారదమహర్షి నుండి ఎప్పుడు జ్ఞానమును పొందితివి? ఇది మాకు నమ్ముటకు శక్యముగాకున్నది" యని బాలురనగా ప్రహ్లాదుడు నారదుని నుండి జ్ఞానమును పొందిన విధమును చెప్పుచున్నాడు.

మాతృగర్భంలో మహోదయము

"ధర్మరాజా! అసురబాలకులు ఈవిధముగా ప్రశ్నింపగా మహాభాగవతుడగు ప్రహ్లాదుడు గతంలో నే నుపదేశించిన విషయములను స్మరించుకొంటూ బాలురకు చెప్పుచున్నాడు" అని నారదుడు ధర్మరాజునకు చెప్పుచున్నాడని శుకబ్రహ్మ పరీక్షిత్తున కెరింగించిన విషయమును నైమిశారణ్యమున సూతుడు శౌనకాది ఋషులకు చెప్పుచున్నాడు.

ప్రహ్లాదుడు చెప్పుచున్నాడు: "పూర్వము మా తండ్రి, దైత్యరాజగు హిరణ్యకశిపుడు మందరపర్వతమున తపస్సు చేయుచుండెను. చాలాకాలమైనను రాకాలడాయెను. అతడు విహతుడయ్యెనని దేవతలు భావించిరి.

పిపీలికై రహిరివ దిష్ట్యా లోకోప తాపనః
పాపేన పాపోऽభక్షీతి వదన్తో వాసవాదయః

'పాము చీమలచే చంపబడునట్లు, మహాపాపియగు హిరణ్యకశిపుడు స్వయంకృత మగు పాపముల వలననె నశించినాడు' అని నిర్ణయించుకొనిన దేవతలు ఇక తమకు

అడ్డులేరని భావించి అసురులపైకి దండెత్తిరి. దేవతలచే తీవ్రముగా కొట్టబడిన రాక్షసులు ప్రాణరక్షణకై పారిపోయిరి. దేవతలు అసుర రాజ్యమును చేజిక్కించుకొనిరి. దేవేంద్రుడు మా తల్లిని పట్టుకొనెను. రోదించుచున్న నా తల్లిని ఇంద్రుడు గొనిపోవుచుండెను. మార్గ మధ్యమున అదృష్టవశమున మహానుభావుడగు నారదమహర్షి ఎదురయ్యెను. ఇలా పలికెను:

'సురేంద్రా! నీవు సురరాజువు. గొప్పవాడవు. ఈ సుచరితను ఏల పట్టుకొనెదవు? ఈమె నిరపరాధి. మహాసాధ్వి. పైగా గర్భవతి. దీనురాలైన ఆమెను విడచిపెట్టుము,' అనెను.

నారదుని వచనముల నాలకించిన మహేంద్రుడు, 'మహర్షీ! ఈమె గర్భమున రాక్షస రాజు వీర్యమున్నది. ఈమె బిడ్డను గనునంతవరకు నా వద్ద నిర్బంధించెదను. పుట్టిన బిడ్డను వధించి ఆ తరువాత ఈమెను విడిచిపెట్టెదను' అనెను.

'ఇంద్రా! ఈమె గర్భమునందున్న శిశువు సామాన్యుడు కాడు. పరమ భాగవతోత్తముడు. నిర్భీతుడు. పాపరహితుడు. నారాయణ నామామృతపాన చిత్తుడు. అతని వధింప నీకు శక్యము కాదు'.

శా॥ నిర్భీతుండు ప్రశస్తభాగవతు డున్నింద్రుండు జన్మాంతరా
విర్భూతాచ్యుతపాదభక్తిమహిమావిష్టుండు దైత్యాంగనా
గర్భస్థుం డగు బాలకుండు బహుసంగ్రామాద్యుపాయంబులన్
దుర్భావంబున బొంది చావడు భవద్దోర్దండవిభ్రాంతుడై.

అని దేవర్షి పలుకగా ఇంద్రుడు మా తల్లిని విడిచిపెట్టెను. నేను నారాయణ భక్తుడనని నారదుని ద్వారా ఆలకించిన ఇంద్రుడు మా తల్లికి ప్రదక్షిణ మాచరించి దివికేగెను.

నారదమహర్షి మా తల్లిని ఆశ్రమమునకు గొనిపోయెను. భర్త వచ్చువరకు ఆశ్రమములో యుండుమని చెప్పెను. పితృసమానుడైన నారదమహర్షి మాటను మా తల్లి అంగీకరించెను. మా తండ్రి తిరిగి వచ్చువరకు నిర్భయముగా నారదాశ్రమములో వసించెను. నా తల్లి కోర్కెపై ఇచ్ఛాప్రసవమును అనుగ్రహించెను. జ్ఞానమును కూడా ఉపదేశించెను.

నాయందు దయగల మహర్షి మా తల్లికి జ్ఞానము నుపదేశించెను. మననము చేయని కారణముచే మా తల్లి ఆ ఉపదేశములన్నీ మరచిపోయినది. నేను ఒక్కవిషయమును కూడా మరువలేదు.

క॥ వెల్లిగొని నాటనుండియు నుల్లసితంబైన దైవయోగంబున శో
భిల్లెడు మునిమత మంతయు నుల్లంబున నిలుపు పుట్ట దొకనా డైనన్.

మహర్షి చెప్పినదంతయు నాలో ప్రతిక్షణము వృద్ధిపొందు చున్నదేగాని విస్మృతికి లోను గాలే" దని ప్రహ్లాదుడనెను.

మరపు మరణము వంటిది. మరపు గలవానికి మోక్షము లభించదు. మరపు పోవలె ననిన మననము వృద్ధిచెందాలి. మననము సాగవలెనన్నచో శ్రద్ధ తోడుకావాలి. శ్రద్ధ లభింప వలెనన్నచో భక్తి నిండియుండాలి. భక్తి కలుగుటకు వైరాగ్య ముదయించాలి.

"బాలకులారా! మహర్షి చెప్పిన తత్త్వోపదేశమును మీకు చెప్పుచున్నాను. మా తల్లి గర్భమున వసించుచు నేను ఆలకించిన విషయమును మీకు వివరించుచున్నాను. మీకు నావలె ఆయన మాటలయందు విశ్వాసము కలిగినచో ఈ నారద మతమును సర్వులకు వితరణ గావింపుడు. వారు వీరనక స్త్రీలకు, బాలురకు కూడా పంచిపెట్టుడు" అని పలికి ప్రహ్లాదుడు తత్త్వోపదేశము చేయుచున్నాడు.

గురువుపై విశ్వాస ముండినపుడు గురుబోధ అర్థమగును. నిజమైన శిష్యుడు తనకు సంతృప్తి నిచ్చిన గురుబోధను పదుగురికి పంచి పెట్టవలెను. అప్పుడే గురువు తృప్తిచెందును. భగవంతుడు కూడా తృప్తిచెందును. గురువును తృప్తిపరచినచో పరమాత్మ తృప్తిచెందును. అందుచేత మహర్షి బోధించిన విషయమును.తాను అందించువట్లే, తన వద్ద గ్రహించిన జ్ఞానమును ఇతరులకు అందించమని ప్రహ్లాదుడు బాలురకు చెప్పుచున్నాడు.

ఆత్మ నిత్యము. కనుక నశింపదు. ఏకమైనది. అందుచేత శుద్ధమైనది. దేహ చలనమునకు కారణమైనది. కనుక క్షేత్రజ్ఞుడైనది. సర్వులకు ఆశ్రయస్థానమైనది. మార్పు చెందనందున అవికార్య సత్తాస్వరూపమై యున్నది. ఏకమైనందున సర్వవ్యాపకమై, అసంగమైయున్నది. ఈ ఆత్మజ్ఞానము నెరిగినవారు దేహాత్మభావమును త్యజించుచున్నారు.

బంగారము గనులలో యుండును. పాషాణముల యందున్న స్వర్ణమును స్వర్ణ కారుడు అగ్నిసంయోగముచే వేరుచేయునట్లు దేహాదుల యందు కలసియున్న ఆత్మను జ్ఞానాగ్ని ద్వారా బుధజనులు వేరుచేయుదురు.

మాయ, మహదహంకారములు, పంచతన్మాత్రలు కలసి అష్టప్రకృతులు. వానికి సత్త్వ రజస్తమో గుణములను మూడు గుణములున్నవి. వాని వికారములు పదునారుగా తెలియుచున్నవి. అవియే ఐదు కర్మేంద్రియములు, ఐదు జ్ఞానేంద్రియములు, ఐదు భూత ములు, ఒక మనస్సునై యున్నవి. వీనియందు అక్షరుడు, అవ్యయుడు నగు ఆత్మ ఏకమై యున్నాడు. పాంచభౌతికమగు స్థావర జంగమముల యందలి అనాత్మను "ఇదికాదు - ఇదికాదు (నేతి-నేతి) యనెడి ఉపనిషద్వాక్యము ద్వారా వేరుచేసి పరమాత్మనే దర్శింప వలె నని కపిలుడు మొదలైన ఆచార్యులు చెప్పియున్నారు.

మోక్షమును పొందగోరువాడు మొదట వ్యతిరేక పద్ధతిద్వారా అనాత్మను దూరం చేసికోవాలి. అటు పిమ్మట అన్వయ పద్ధతిద్వారా ఆత్మ జ్ఞానమును పొంది, ఉన్న సర్వ గతుడైన ఆత్మ ఒక్కడే అనెడి జ్ఞానమునుపొంది తరించాలి.

బుద్ధికి మూడు అవస్థలుగలవు. అవియే జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలు, వీటిని గ్రహించువాడే పరమాత్మ. పూలవాసన ముక్కుకు అందగానే గాలిచేచుచున్నట్లు మనము గ్రహింతుము. త్రిగుణ మిళితమైన ఈ బుద్ధి నుండి కదలెడి విభిన్న క్రియలద్వారా ఆత్మ నెరుగవలెను.

బుద్ధిలో జరుగు మార్పుల వలనను, గుణకర్మల వలనను జీవులకు సంసారములు తయారగుచున్నవి. స్వప్నము ఎలా అసత్యమో ఈ సంసారము కూడా అసత్యమైనదియే. అందుచేత సంసారము అశాశ్వతము. అశాశ్వతమైన సంసారము విషయమున జీవులు జాగరూకులై యుండవలెను.

సావధానోభవ త్వ చ గ్రాహ్య గ్రాహక సంగమే
అ జస్ర మేవ సంకల్ప దశాః పరిహరన్ శనైః

"గ్రాహ్యగ్రాహక సంగమమున జాగ్రత్తను కలిగియుండాలి. సంకల్ప దశలను సదా మెల్లమెల్లగా త్యజిస్తూ యుండాలి" అని అన్నపూర్ణోపనిషత్తు ప్రవచించినది. శబ్దాది విషయముల యందు ఏర్పడు సంగమమే గ్రాహ్యగ్రాహక సంగమము. ఈ విషయమునే ప్రహ్లాదుడు బాలుర కుపదేశించుచున్నాడు. గుణములతో కూడిన సర్వకర్మములను నాశనము చేయునట్టిది, అవస్థాత్రయమును అంతమొందించునదియు నగు భక్తియోగము నభ్యసింపుమని బాలురకు చెప్పుచున్నాడు.

ఏది శ్రేష్ఠమైన మార్గమని జనులు మీమాంసలో పడియుందురు. దేని నాచరించుట వలన పరమాత్మయందు అపరిమితానురాగము జీవునికి కలుగునో అదియే శ్రేష్ఠమైన మార్గమని ప్రహ్లాదుడు చెప్పెను.

మతులు మారుతుంటాయి. వాటితోపాటు మతాలు మారుతుంటాయి. అందరి మనస్సులు ఒకటిగా లేవు. అందుచేత ఒకే యోగము అందరికి ఉపకరించదు. దేని నాచరించుట వలన బుద్ధి పరమాత్మ యందు స్థిరముగా నిలుచునో అదియే శ్రేష్ఠమని ప్రహ్లాదకుమారుడు చెప్పుటలోని అంతర్భావమిదియే. ప్రహ్లాదుడు ఇంకా చెప్పుచున్నాడు:

"స్నేహితులారా! గురువును సేవించాలి. మనకు లభ్యమైన దానిని గురుసేవలో వినియోగించాలి. సత్పురుషులతో సాంగత్యము జరపాలి. భగవానుని ఆరాధించాలి. కథా శ్రవణము నందు ఆసక్తి కలిగియుండాలి. అర్చనాదులు సాగించాలి. ఈవిధమైన భగవత్ప్రీతి కరములగు కర్మలద్వారా పరమాత్మ యందు అభిరుచి మెండగును" అని ప్రహ్లాదు డనెను.

హరిః సర్వేషు భూతేషు భగవానాస్త ఈశ్వరః
ఇతి భూతాని మనసా కామైస్తైః సాధు మానయేత్

"భగవానుడగు శ్రీహరి సర్వభూతముల యందున్నాడని విశ్వసించి యథాశక్తిగ సర్వ ప్రాణుల కోర్కెలను దీర్పవలెను. సాధువులను గౌరవింపవలెను" అని ప్రహ్లాదు డనెను.

మహాత్ముల ద్వారానే మాధవుని తెలిసికొనవలెను. గురువు ద్వారానే గోవిందుడు తెలియును. గురువులేనిదే భవసాగరమును దాటలేము.

ఆచార్యః ప్లావితా తస్య జ్ఞానం ప్లవ ఇహోచ్యతే

"జ్ఞానమనెడి తెప్పద్వారా మనలను తీరమునకు చేర్చునావికుడే సద్గురువు."

గురువనగా అంధకారమును అదృశ్యము చేయువాడని భావము. ఇచ్చట గురు పదమునకు మరియొక అర్థము కూడాకలదు.

గుకారశ్చ గుణాతీతో రుకారో రూపవర్జితః
గుణాతీత మరూపంచ యత్తత్త్వం స గురుస్మృతః

'గు' కారము గుణాతీతస్థితిని తెలుపుచుండ, 'రు' కారము అరూపస్థితిని తెలుపు చున్నది. కనుక గుణాతీతమై, రూపరహితమైన స్థితి ఏది కలదో అదియే గురువు.

కనుక గురువును దేహమునకు పరిమితుడని భావింపరాదు. దైవమునందు ఎట్టి భక్తిని గల్గియుందుమో, గురువు నందును, సాధువుల యందును అట్టి భక్తినే కల్గియుండ వలెను. విగ్రహమును బొయి అని భావించకూడదు. గురువును మానవుడని తలచకూడదు.

ఆరాధనలు, అర్చనలు దేనికి? అని ప్రహ్లాదుడు ప్రశ్నించుచున్నాడు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యము లనెడి అరిషడ్వర్గములను పోగొట్టుకొనుటకే సర్వసాధనలు ఉపయోగపడవలెనని చెప్పుచున్నాడు. కలుపుతీయనిదే మొక్కలు ఏపుగా పెరగవు. అజ్ఞాన మంతరించినపుడే జ్ఞానము ప్రవర్ధమానమగును.

మహాత్ములు ఈశ్వర ప్రణిధానము నందు తృప్తిచెందుచుందురు. సంకీర్తనము ద్వారా సంతృప్తి చెందుచుందురు. వారు ప్రేమలతను పెంచుచుందురు. దానిని కన్నీటితో తడుపుచుందురు. కన్నీటి జలముతో పెరిగిన ఈ ప్రేమలత ఒకనాటికి అమృతఫలము నందించును. అదియే ధ్యేయస్వరూపము. కనుక ధ్యేయరూపుడైన పరమాత్మను దరిజేర్చే ధ్యానమే శ్రేయమని మహాత్ములు భావించారు. జీవించారు.

ధ్యానమె వరమైన గంగాస్నానమె మనసా, రామ ॥ధ్యానమె॥

"గంగాస్నానము కంటెను ధ్యానమే శ్రేష్ఠ" మని త్యాగరాజస్వామి కీర్తించెను.

"ఏదీ నందకుంజము? ఏడీ నా నందనందనుడు. శ్యామసుందరుడు. నా ఆకలి ఏమైనది? నా నిద్ర ఎచ్చోట కేగినది? ఈ ప్రేమశరము ఏ వైపునుండి వచ్చి నా హృదయమును తాకినది? నా విశ్రాంతి ఏమైనది? వరదల నడ్డగించుచున్నారే! నే నీ కన్నీటిని ఆపలేకున్నా నేమి? కృష్ణా! కారిపోనీ.... ఆ కన్నీటితోపాటు నా కష్టాలన్నీ రాలిపోనీ. నా దాహంలో ఓదార్పు నిలిచి ఉంది. నీ నామంలో సుధారస మొలుకుతున్నది. నీ నిరీక్షణలో నిరవధిక సుఖము లభించుచున్నది" అని విరహబాధ ననుభవిస్తూ నిరీక్షణలోనే నిర్వికల్ప సమాధిని భక్తు లనుభవిస్తారు.

సీ॥ దనుజారిలీలావతారంబులందలి శౌర్యకర్మంబులు సద్గుణములు
విని భక్తు డగువాడు వేడ్కతో బులకించి కన్నుల హర్షాశ్రుకణము లొలుక
గద్గదస్వరముతో గమలాక్ష వైకుంఠ వరద నారాయణ వాసుదేవ
యనుచు నొత్తిలిపాడు నాడు నాక్రోశించు నగు జింతనము సేయు నలి యొనర్చు

తే॥ మరులుకొనియుండు దనలోన మాటలాడు వేల్పు సోకిన పురుషుని వృత్తి దిరుగు
బంధముల బాసి యజ్ఞానపటలి గాల్చి విష్ణు బ్రాపించు దుది భక్తివివశు డగుచు.

అని భక్తుని పారవశ్యమును ప్రహ్లాదుడు అనుభవము నుండి పలికినాడు.

చక్రధారిని ఆశ్రయించిన వారే సంసారచక్ర భ్రమణము నుండి విముక్తినొందెదరు. నిత్యసుఖ రూపమైన మోక్షమునుబొంది తరింతురు. కనుక హృదయనివాసియైన పరమాత్మను ధ్యానింపుమని అసుర బాలకులకు ప్రహ్లాదుడు చెప్పుచున్నాడు.

"బాలకులారా! ధన, కళత్ర, పుత్రాదులు శాశ్వతములుగావు. ఆయువు కూడా స్థిరముకాదు. మనుష్యత్వము కూడా అనిత్యమే. స్వర్గాదులు కూడా నిత్యములుగావు. అందువలన వీటిని మనము ఆశింపకూడదు. శ్రీహరినే వాంఛించాలి. శ్రీనాథునే ధ్యానించాలి.

సవై దేహస్తు పారక్యో భఙ్గురో యాత్యుపైత్రి చ

"ఏ దేహమును పురుషుడు అమితముగా ప్రేమించునో ఆ దేహము ఇతరులకు సంబంధించినది. కుక్కలకు, నక్కలకు ఆస్తిగా మారునది. దేహమునకే ఈ స్థితి సంప్రాప్త మగునపుడు ఈ దేహమునకు సంబంధించిన భార్యాపుత్రాదులు, బంధుమిత్రాదులు ఎవరికి సంబంధించి యున్నారు?" అని ప్రహ్లాదుడు ప్రశ్నించుచున్నాడు.

కిమేతై రాత్మన స్తుచ్ఛైః సహ దేహేన నశ్వరైః
అనర్థై రర్థ కాశై ర్నిత్యానన్ద రసో దధేః

"ఈవిధముగా సర్వవిషయములు దేహముతోపాటు నశించేవియే. అనర్థములే. అనర్థము లైనను అర్థవంతములైనట్లు శోభించుచున్నవి. తుచ్ఛమైన ఈ అనర్థముల ద్వారా నిత్యానంద రస సముద్రము లభ్యమగునా?" అంటున్నాడు ప్రహ్లాద కుమారుడు.

ఆడిన ఆటలు చాలు. ఆటకట్టే మేలు. కర్మానుభవము విచిత్రమైనది. కర్మ అంతము గావచ్చు. అంతమాత్రాన భోగము అంతరించునని చెప్పలేము. దేహి దేహము ద్వారా కర్మ నాచరించును. ఆ కర్మఫలము అనేక దేహములకు కారణమగును. ఈ విధముగా దేహమువలన కర్మలు, కర్మలవలన దేహములు విస్తరించుచుండును. కర్మ సుడిగుండము అతి భయంకరమైనది.

కృతి మహోదధౌ పతన కారణం ఫలమశాశ్వతం గతి నిరోధకం

"కర్మలన్నీ పతన హేతువులై కర్మసముద్రమున పడదోయుచున్నవి. కర్మల ఫలితములు అశాశ్వతములై యున్నవి. పైగా జన్మకు కారణమై గమ్యమును నిరోధించు చున్నవి" అంటారు భగవాన్ రమణమహర్షులవారు. బంధమునకు కారణమైన కర్మ మోక్షము నెలా ప్రసాదిస్తుంది?

యదేవ ప్రవృత్తి కారణం తదేవ నివృత్తి కారణం న భవతి

"ఏది బంధమునకు కారణమైనదో అది మోక్షమునకు కారణము కాజాలదు" అంటారు బృహదారణ్యకోపనిషత్తు భాష్యంలో శ్రీశంకరులు.

"బాలకులారా! కనుక శ్రీహరినే ఆశ్రయింపుడు. అతడు సర్వభూతాంతరాత్ముడు. సర్వులకు ప్రియమైనవాడు. సర్వగతుడు. ఆయనకు బ్రాహ్మణత్వము ప్రియముగాదు. దేవత్వము ఇష్టముగాదు. ఋషిత్వము వాంఛనీయముకాదు. సదాచారము అభిలషణీయము గాదు. యజ్ఞదాన తపస్సులు, వ్రతాది శౌచములు ఆయనకు ప్రీతిని కలిగించవు. తృప్తి నందించవు. మరి ఆయనకు తృప్తికరములైన వేమిటో తెలిపెదను. ఆలకింపుడు" అని ప్రహ్లాదుడు చెప్పసాగెను.

ప్రీయతేఽమలయా భక్త్యా హరిరన్య ద్విడంబనమ్

"భక్తి తప్ప అన్యములన్నియు నిరుపయోగములే". పరమాత్మ భక్తివశుడు. ప్రేమభక్తికి భగవానుడు పరవశించును. సర్వము భగవదర్పణము చేసినవాడు ముక్తికి యత్నింప పనిలేదు. అది భగవానుని కార్యమైయున్నది.

క॥ **చిక్కడు వ్రతముల గ్రతువుల జిక్కడు దానముల శౌచశీలతపములం**
జిక్కడు యుక్తిని, భక్తిని జిక్కినక్రియ నచ్యుతుండు సిద్ధముసుండీ!

"బాలకులారా! నా మాటల నాలకింపుడు. యోచింపుడు. పరమాత్మ భక్తికే లొంగును. ఈ ప్రపంచమంతయు విష్ణుమయమని ఎవరు తెలిసికొందురో వారే తరింతురు. మన ఆచార్యులు వారికి తెలిసిన చదువులు చెప్పుచున్నారేగాని వారి అనుభవములో లేని విష్ణుభక్తిని గూర్చి చెప్పలేకయున్నారు. ఈ గ్రుడ్డిచదువు నెంతకాలము చదివినను ప్రయోజనముండదు.

క॥ **గురువులు దమకుమ లోబడు తెరువులు సెప్పెదరు విష్ణుదివ్యపదవికిం**
దెరువులు సెప్పరు చీకటి బరువులు వెట్టంగ నేల బాలకులారా!

అని చెప్పి, "బాలకులారా! రండి, మీ పుస్తకములన్నియు గురువులవద్ద పడవేసి నా వద్దకురండి. మీకు శ్రేయోమార్గమును చెప్పెదను. ఇష్టములేని వారు కర్మలపాలైపొండి. సద్గతియో దుర్గతియో ఏది కావలెనో మీరే నిర్ణయించుకోండి" యనెను. ప్రహ్లాదుని మాటలచే ప్రభావితులైన అసురబాలకులు ఆచార్యులను వదలి ప్రహ్లాదుని వద్దకు వచ్చి చెప్పమనిరి.

క॥ **ఆడుదము మనము హరిరతి బాడుద మే ప్రొద్దు విష్ణుభద్రయశంబుల్**
వీడుదము దనుజసంగతి గూడుదము ముకుందభక్తికోటిన్ మాటిన్.

"రండి. శ్రీహరి నామము నుచ్చరించుచు ఆడుకొందుము. కీర్తనములను పాడు కొందుము. ఈ మాయా రాక్షసుల సంబంధము మానుకొందుము. భక్తుల సాంగత్యమును చేసికొందుము. సంసారమును దూరము చేసికొందుము. కామక్రోధములను చీల్చి చెండాడెదము. మనస్సును మాధవునకు సమర్పించి తరించెదము" అని పలికి

అసురబాలురతో గూడి ప్రహ్లాదుడు హరిభక్తిలో మునిగిపోయెను. ఇది గాంచిన చండ మర్కుల ప్రాణాలు గాలిలో తేలిపోయెను. ఏమి చేయుటకు తోచక దైత్యరాజగు హిరణ్యకశిపుని చేరిరి. జరిగిన విషయము నంతటిని తెలిపిరి. రాక్షసబాలురు కూడా ప్రహ్లాదుని బోధలవలన విష్ణుభక్తితో ఊగిపోవుచున్నారని పలికిరి. హిరణ్యకశిపుడు క్రుద్ధుడయ్యెను. పెదవులు వణకుచుండ లేచి నిలబడెను. ప్రహ్లాదకుమారుని వధించుటలో జాప్యము హానికరమని భావించెను. వధించుటకు నిర్ణయించెను.

నారసింహ వైభవము

దైత్యరాజు ప్రహ్లాదుని పిలిపించెను. తండ్రికి నమస్కరించుచు ప్రహ్లాదుడు విధేయుడై నిలబడెను. శాంతుడై, నిర్మలుడై యున్న ప్రహ్లాదుని జూచి దైత్యరాజు:

"ఓరీ మూర్ఖుడా! ప్రహ్లాదా! నన్ను గూర్చి ఏమని భావించుచుంటివి? నన్నుజూచి గొప్పగా ప్రకాశించుటకు సూర్యుడు వెనుకాడును. వాయుదేవుడు పెద్దగా వీచుటకు భయపడును. నా ముందు అగ్ని ప్రతాపహీనుడై యుండును. నేను తలయెత్తిచూచిన యముడు చంపుటను మానును. ఇంద్రుడు నా ముందు తలవంచి నిలబడును. ఇక సామాన్య దేవతల విషయము చెప్పనవసరములేదు. దేవతలే ఈ విధముగా నన్నుజూచి భయపడుచుండగా నీ వెందులకు భయపడవు? నేను కోపించిన నిన్ను రక్షించు వారెవ్వరు? ఎచ్చోటికి పరుగు లిడెదవు? ఎవడురా నీకు దిక్కు?

క॥ **దిక్కులు గెలిచితి నన్నియు దిక్కెవ్వడు రోరి! నీకు? దేవేంద్రాదుల్**
దిక్కులరాజులు నే జొక్క దిక్కైటుగక కొలుతు రితడె దిక్కని నన్నున్.

"ఓరీ బాలకా! మందమతీ! విష్ణువు శూరుడని పలుకుచున్నావు. శూరుడైనచో నేను దేవతలను చీల్చి చెండాడునపుడు ఆ పిరికిపంద ఏమయ్యెనురా? పాలుత్రాగు అర్భకునివలె పాలసముద్రము నుండి పారిపోయెను.

"చెడిన మర్కటమువలె బాలురందరిని పాడుచేసినావు. వారి మనస్సులలో విష్ణుభక్తి యనెడి విషమును పోసినావు. నిన్నిక మన్నించి లాభములేదు. నిన్ను వధించుటయే దైత్యవంశమునకు శ్రేయము.

"నేను ఒంటరిగా వెళ్ళి ఎందరినో జంపితిని. నన్ను మించినవారు ఈ త్రిభువనము లందును లేరు. ఎవరి అండ జూనుకొని నీవిలా ప్రేలుతుంటివి? ఎవడురా నీకు బలము?" అని హిరణ్యకశిపుడు దండించగనే ప్రహ్లాదు డిలాపలికెను.

క॥ **బలయుతులకు దుర్బలులకు బల మెవ్వడు నీకు నాకు బ్రహ్మాదులకున్**
బల మెవ్వడు ప్రాణులకును బల మెవ్వం డట్టి విభుడు బల మసురేంద్రా!

"రాజా! బలము గలవారికి, బలము లేనివారికి, నీకు, నాకు, బ్రహ్మాది దేవతలకు ఎవ్వడు శక్తినిచ్చువాడో సర్వప్రాణులకు బలము నొసగువాడే నాకును బలమైయున్నాడు.

"నాకు దిక్కెవరని అడుగుచున్నావు. దిక్కులు తెలియనివాడే నాకు దిక్కైయున్నాడు. సృష్టి స్థితి లయాదులు ఎవనియందు జరుగుచున్నవో, సమస్త ఘటములలో ఎవడు ప్రతిబింబించి యున్నాడో అట్టి విష్ణువే నాకు దిక్కైయున్నాడు. తండ్రీ! నామాట నాలకింపుము. సమభావముతో వర్తింపుము. దారి తప్పి నడకసాగించు నీ మనస్సును నిగ్రహింపుము. నీ యనుచరులందరు నిన్ను జూచి భయపడి సత్యమును వచించుటలేదు. అప్రియమని హితమును పలుకలేకున్నారు.

వైరు లెవ్వరు చిత్తంబు వైరి గాక చిత్తమును నీకు వశముగా జేయ వయ్య

"తండ్రీ! దారి తప్పి నడుచు మనస్సుకంటె శత్రువు లెవరున్నారు? ఎన్నో లోకములను జయించినావు. ఎందరినో వధించినావు. కానీ ఇంద్రియములను నిగ్రహించితివా? మనస్సును గెలిచితివా? నీ బలమేమైనది? ఒక్క శత్రువు బయటనున్నాడని భ్రమించుచున్నావు. ఆరుగురు శత్రువులు లోనున్నారని గ్రహించితివా?

ఉ॥ లోకము లన్నియున్ గడియలోన జయించినవాడ వింద్రియా
నీకము జిత్తమున్ గెలువనేరవు నిన్ను నిబద్ధు జేయు నీ
భీకరశత్రు లార్వుర బ్రభిన్నుల జేయుము ప్రాణికోటిలో
నీకు విరోధి లే డొకడు వేర్పున జూడుము దానవేశ్వరా!

"ఆంతరంగిక శత్రువులను జయించినవాడే నిజమైన చక్రవర్తి యగును. కామక్రోధాదులను జయించిన వారికి, బయట జయించడానికి శత్రువులు మిగలరు. అందరూ మిత్రులే యగుదురు. తండ్రీ! విషమత్వమును తొలగించుకొనుము. సమత్వమును పెంచుకొనుము. అసురుడనైనను అమరజీవనము ననుభవించుము. హృదయమున నారాయణుని స్మరింపుము" అనెను.

హిరణ్యకశిపుడు ప్రహ్లాదునితో, "రాజుచే మరణదండనకు గురైనవాడు ఎలాగూ చచ్చుచున్నాము గదా యని ఎవ్వరిని లెక్కచేయక నోటికి వచ్చినట్లు ప్రేలువట్లు దుర్మదాంధుడవై, కన్ను గానక, మిన్ను తెలియక, నన్నుగూర్చి అదురు బెదరు లెరుగక వాగుచున్నావు.

"ఈ ప్రపంచానికి నేను రాజును. విష్ణువు దొంగవలె ఎక్కడనో దాగియున్నాడు. నా సోదరుని కుయుక్తులతో చంపిన ఆ విష్ణువును హతమార్చెదనని నేను శపథము చేసితిని. ప్రాణ భీతిచే ఆ పిరికిపంద పలాయనమైనాడు. ఇంతవరకు వాడి జాడ తెలిసిరాలేదు. అన్వేషించి అలసిపోయినాను. ఇక వాడెక్కడున్నాడురా తులువా? చెప్పుము. వాడెక్కడున్నాడో తెలుపుము. నిన్ను, వాడిని ఇరువురిని హతమార్చెదను" యని గర్జించెను.

నారాయణ చరణకమల స్మరణ మనెడి సుధారసమును సదా పానముజేయు ప్రహ్లాదకుమారుడు తండ్రితో ఇట్లనెను: "తండ్రీ! విష్ణువు సర్వవ్యాపకుడు. సర్వాంతర్యామి.

అతడులేని చోటులేదు. నీటిలో యున్నాడు. నింగిలో నున్నాడు. నిప్పులో నున్నాడు. శిలలో నున్నాడు. నిఖిల జగముల నిండియున్నాడు. నాలో యున్నాడు. నీలో యున్నాడు. అట్టి మహితాత్ముని ఇక్కడ, అక్కడ యని దేశకాలాదులకు పరిమిత మొనర్పగలమా?

క॥ ఇందు గల డందు లే డని సందేహము వలదు, చక్రి సర్వోపగతుం
డెం దెందు వెదకి చూచిన నందందే కలడు దానవాగ్రణి! వింటే.

"రాజా! విష్ణువు సర్వగతుడు. అందుచేత చూడబడువాడే కాడు. చూచే సంస్కారులకు సర్వత్ర దర్శనీయుడే" యని ప్రహ్లాదు డనెను.

అంతటా ఉన్నాడని ప్రహ్లాదుడు, ఎక్కడా లేడని హిరణ్యకశిపుడు. ఉండి, లేడనెడివాడు కలడో లేడో తెలిసే సమయ మాసన్నమాయెను. అప్పటికే నరసింహమూర్తి ప్రతి వస్తువులో నిండియుండెను. ప్రహ్లాదుని రక్షించుటకు సిద్ధపడియుండెను. క్రుద్ధుడైన హిరణ్యకశిపుడు ఒక్కసారి భయంకరముగా గర్జించుచు,

"ఓరీకుఱ్ఱా! అహంకారివియై విష్ణువంతట నున్నాడని ప్రేలుచున్నావు. ఇదిగో ఈ స్తంభమున చూపించగలవా? లేనిచో నీ మస్తకమును త్రుంచివేసెదను. అప్పుడా విష్ణువు వచ్చి నిన్ను రక్షించునేమో చూచెదను;" అనగా ప్రహ్లాదు డిలాపలికెను:

"తండ్రీ! బ్రహ్మమొదలు అణువువరకు వ్యాపించియున్న విష్ణుమూర్తి ఇంత పెద్ద స్తంభములో లేకపోవునా? ఈ విషయమున సందేహము అవసరములేదు. ఈ నాడు ఆ మనోహరమూర్తి మనకు దర్శన మొసగగలడు" అని పలుకగనే తటుక్కునలేచి, సింహాసనముదిగి, కత్తిదూసి ప్రహ్లాదునిమీది కురికెను. మరుక్షణమునవే స్తంభమును సమీపించి, స్తంభమును అఱచేతితో గ్రుద్దెను. వెంటనే భయంకర రూపముతో నరసింహమూర్తి ఆ స్తంభమున ప్రత్యక్షమాయెను. మృగముగాక, మనిషిగాక యున్న ఈ రూపమెవరా? యని హిరణ్యకశిపు డాలోచించెను.

క॥ నరమూర్తిగాదు కేవల హరిమూర్తియుగాదు మానవాకారము గే
సరియాకారము నున్నది హరిమాయారచిత మగు యథార్థము సూడన్.

తన భక్తుడైన ప్రహ్లాదుని ఉద్ధరించుటకు విష్ణువే ఈ రూపమున వచ్చియుండవచ్చును అని దైత్యరాజు తలచెను. నృసింహమూర్తి ఐదు మొగముల నుండి లేచిన జ్వాలలు భూమ్యాకాశముల నావరించినవి. ప్రళయకాల మేఘముల యందలి మెఱుపువలె శ్రీహరి గోళ్ళ శోభ గోచరించెను. నరహరి అసురాధమునిపై బడెను. పాము ఎలుకను పట్టుకొనినట్లు పట్టుకొనెను. హిరణ్యకశిపుడు అల్లల్లాడెను. నరహరికి లొంగిపోయెను.

క॥ సురరాజవైరి లోబడె బరిభావితసాధుభక్త పటలాంహునకున్
నరసింహునకు మదంచ త్ఖరతరజిహ్వున కుదగ్ర ఘనరంహునకున్.

హిరణ్యకశిపుని నరహరి తన తొడమీద పెట్టుకొని గరుత్మంతుడు పామును జీల్చినట్లు తనవాడి గోళ్ళతో చీల్చెను. నరహరి అంతటితో ఆగలేదు. కొంతసేపు హృదయము చించును. భూమిపై నెత్తురుచల్లును. కఠినములైన నరములను త్రెంచును.

బొమ్మను పగులగొట్టును. ప్రేగులను హారములుగ వేసికొనెను. నారసింహుని గోళ్ళు నానావిధ శోభలను ప్రవర్తించెను.

సీ॥ వక్షఃకవాటంబు వ్రక్కలు సేయుచో ఘనకుఠారంబుల కరణి నొప్పు,
గంభీరహృదయపంకజము భేదించుచో గుద్దాలములభంగి గొమరు మిగులు
ధమనీవితానంబు దవిలి ఖండించుచో బటు లవిత్రంబుల పగిది మెఱయు
జఠరవిశాలాంత్ర జాలంబు ద్రెంచుచో గ్రకచసంఘంబుల గరిమ జూపు

తే॥ నంకగతుడైన దైత్యుని నాగ్రహమున శస్త్రచయముల నొంపక సంహరించి
యమరు నరసింహునఖరంబు లతివిచిత్ర సమరముఖరంబులై యుండె జనవరేణ్య!

దైత్యరాజును తొడపై పెట్టుకొని చీల్చునపుడు నృసింహమూర్తి గోళ్ళు గొడ్డండ్లవలె గోచరించెను. లోతైన గుండెను పెకలించునపుడు గుద్దళ్ళవలె తెలిసెను. నరములను ఖండించునపుడు కొడవళ్ళవలె నుండెను. కడుపులోని ప్రేగులను త్రెంచునపుడు రంపములవలె తెలిసెను. ఈ విధముగా దుష్టులను శిక్షించునవియు, శిష్టులను రక్షించునవియునగు గోళ్ళు ప్రకాశించు చుండెను.

భయంకరమైన నృసింహదేవుని యొద్దకు ఎవ్వరూ వెళ్ళలేకపోయిరి. దేవతలు దివినుండి పూలవానలను గురిపించిరి. ఇంద్రాది దేవతలు భయపడి దూరము నుండియే నమస్కరించిరి. బ్రహ్మ స్తుతించెను. రుద్రుడు ప్రార్థించెను. ఇంద్రుడు శ్లాఘించెను. ఋషులు కీర్తించిరి. సిద్ధులు, విద్యాధరులు, భుజంగులు, ప్రజాపతులు, గంధర్వులు, చారణులు, యక్షులు, కింపురుషులు, వైతాళికులు, కిన్నరులు, విష్ణుసేవకులు, సర్వులు ప్రశంసించి ప్రార్థనలు చేసిరి.

నరహరి ప్రహ్లాదునికి ప్రసన్నుడగుట

బ్రహ్మాది దేవతలు సైతము నరసింహమూర్తి వద్దకు వెళ్ళలేకపోయిరి. దేవతలందరు లక్ష్మీదేవిని ప్రార్థించిరి. "అమ్మా! నీవు నరహరికి భార్యవు. సదా ఆయనను సేవించుదానవు. హరియందే చిత్తము నుంచిన దానవు. నే డుగ్రరూపమును దాల్చియున్న విష్ణుదేవుని శాంతపరచుము" యని ప్రార్థించిరి.

లక్ష్మీదేవి స్వామిని చేర ప్రయత్నించినది. శ్రీహరి ముఖము ప్రళయకాల సూర్యుని వలె యున్నదేగాని పూర్ణచంద్రుని పగిదిలేదు. ఆయన దృష్టి జ్వాలలను వెడలగ్రక్కు చున్నదే గాని చల్లగా లేదు. రౌద్రము గన్పించు చున్నదేగాని శాంతములేదు. శ్రీదేవి ధైర్యము చాలలేదు. బ్రహ్మదేవుడు ప్రహ్లాదునితో "నాయనా! ప్రహ్లాద కుమారా! నీ తండ్రిని శాంతింప జేయుటకు నీవే సమర్థుడవు. వెళ్ళుము" యనెను.

ప్రహ్లాదుడు నరసింహమూర్తిని సమీపించెను. సాష్టాంగ నమస్కారము చేసెను. నరహరి ప్రహ్లాదుని శిరమున తన అభయహస్తము నుంచి ఆశీర్వదించెను. సర్వులకు

అతిభయంకరుడుగా తెలియు నృసింహమూర్తి ప్రహ్లాదునకు మనోహరముగా, ప్రశాంతముగా గోచరించెను. భగవానుడు భక్తసులభుడు. ప్రహ్లాదుడు నారాయణుని స్తుతించుచున్నాడు.

"తండ్రీ! నాజన్మ ధన్యమైనది. నేను క్రూరుడను. రాక్షసుడనై పుట్టితిని. బ్రహ్మాది దేవతలకు కూడా ప్రసాదించని యనుగ్రహమును ఈ భృత్యునికి ప్రసాదించితివి. రాక్షసుడని భావింపక నీ కరాంబుజమును నా తలపై నుంచితివి. నీ నిర్హేతుక జాయమాన కటాక్షమునకు నేను పరవశించుచున్నాను. నీ దయ తప్పినచో తల్లిదండ్రులు బిడ్డలను పోషించలేరు. ఔషధము రోగుల కుపకరించదు. సాగరమున మునుగువారిని నౌక ఉద్ధరించదు.

"దేవా! నాకు భోగము లవసరములేదు. సుఖములతో పనిలేదు. నీవు అణిమాది సిద్ధుల ననుగ్రహింప పనిలేదు. నిన్నే శరణుజొచ్చిన నన్ను నీ పాదపద్మముల కడకు చేర్చుకొనుము. క్షణభంగురమైన దేహమును విశ్వసించి, అది రోగాల పుట్టయని ఎఱుగక, జనులు తీరని కామమునకు లోనై విషయముల ననుభవించుచు పతితు లగుచున్నారు. దరి తెలియలేక బ్రతుకును నమ్మచేసుకొనుచున్నారు.

మ.కో॥ ఎండమావులవంటి భద్రము లెల్ల పార్థములంచు మ
ర్త్యుండు రోగనిదానదేహముతో విరక్తుడుగాక యు
ద్దండమన్మథవహ్నినెప్పుడు దప్తుడై యొకవాడు జే
రండు పారము దుష్టసౌఖ్యపరంపరాక్రమణంబునన్.

"తండ్రీ! మానవుల తాపత్రయములు భయంకరమై గన్పట్టుచున్నవి. మనస్సు వాంఛల వెంట పరుగులిడునే గాని నిన్ను ధ్యానించు టెరుగదు. నాలుక రుచుల ననుభవించునే గాని నిన్ను స్తుతింపదు. దృష్టి వనితల సౌందర్యమును వీక్షించునే గాని నీ దివ్య ముఖారవిందమును దర్శింపలేదు. చెవులు ప్రాపంచిక వార్తల నాలకించును గాని నీ కథా శ్రవణమునకు నోచుకోవు. ముక్కు వాసన లాఘ్రాణించునే గాని ప్రాణాయామాది యోగక్రియలకు అలవాటుపడదు. బహుభార్యలను కలిగిన పురుషునివలె, ఇంద్రియములచే జిక్కి జనులు మృతులగుచున్నారు.

"దేవా! నీ అనుగ్రహమునకు పాత్రుడ నగుటచే, సంసారము నన్నంతగా బాధించుటలేదు. తండ్రీ! నాకు నీ కృపతప్ప అన్యము లవసరములేదు" అని ముకుళిత హస్తుడై ప్రార్థింపగా, ప్రహ్లాదుని భక్తి వచనములతో సంతృప్తి చెందిన నృసింహమూర్తి తన అనుగ్రహ భాషణమును చేసెను.

ప్రహ్లాద భద్రం భద్రం తే ప్రీతోఽహం తేఽసురోత్తమ
వరం వృణీష్వాభిమతం కామపూరోఽస్మ్యహం నృణామ్

"శుభకరుడా! ప్రహ్లాదా! నీకు శుభమగుగాక! నేను నీకు ప్రసన్నుడ నైతిని. నేను జీవుల కోర్కెలను తీర్చువాడను. నీ అభీష్టములను తెలుపుము. నీవు కోరిన వరము లొసగెదను. వత్సా! నన్ను దర్శించని వానికి దుఃఖములు తీరవు. నన్ను దర్శించిన వానికి మరియొక స్పృహ ఉండదు" అనెను.

"తంద్రీ! ఈ వరములద్వారా నన్ను ప్రలోభపెట్టకుము. బలహీనుడను. కోర్కెల వలలో పడినచో మఱల పునర్జీవితుడను కాలేను. నాకు వరము లీయవలదు. నిన్ను శరణు జొచ్చితిని.

అహం త్వ కామస్త్వ ద్భక్త స్త్వం చ స్వామ్య న పాశ్రయః

"నేను నీకు నిష్కామ భక్తుడను. నీవు నాకు అప్రేమయ ప్రభుడవు."

"దేవా! కోరికలు ఇంద్రియములను బలహీన పరచును. దేహమును శిథిల మొనర్చును. మనస్సును కలుషితము చేయును. కోరికలు జీవులను సర్వనాశనము చేయును. కోరికలను పోగొట్టుకొనినవాడే నీ దివ్యరూపమును సదా గాంచ గలుగును.

యది దాస్యసి మే కామాన్ వరాం స్త్వం వరదర్షభ

కామానాం హృద్య సంరోహం భవతస్తు వృణే వరమ్

"వరముల నొసగువారిలో వరిష్ఠుడవగు ఓ దేవా! నాకు ఇష్టములైన వరముల నీయవలెనని నీవు సంకల్పించినచో, నా మనస్సులో కోరికలు కలుగకుండునట్లు ఆశీర్వదింపుము" అనెను.

ఈవిధముగా పలికి వినమ్రుడై, శిరమువంచి నరహరికి నమస్కరించి ఆయనను స్తుతించెను.

ఓం నమో భగవతే తుభ్యం పురుషాయ మహాత్మనే

హరయేఽద్భుత నారసింహాయ బ్రహ్మణే పరమాత్మనే

యని నృసింహమూర్తికి నమస్కరించెను.

"ప్రహ్లాదా! నీవంటి ఉత్తమ భక్తులకు కోరికలుండవని నాకు తెలియును. నీవు సదా నా కథలను శ్రవణము చేయుచు, సర్వభూతముల యందున్న నన్నొక్కడినే నిత్యముగా స్మరించుచూ, కర్మములను వదలి, సద్భక్తిచే తరింపుము. నన్ను స్మరించువారు, నన్ను ధ్యానించువారు, నా కథలను శ్రవణము చేయువారు తప్పక తరించగలరు" అని శ్రీహరి పలికెను.

ప్రహ్లాదుడు నరహరిని "తంద్రీ! తన సోదరుని నీవు వధించితి వనెడి క్రోధముతో నా తండ్రి నీపై పగబూనెను. నిన్ను నిందించెను. దూషించెను. నీ భక్తుడనైన నన్ను అనేకవిధముల హింసించెను. దాట శక్యముగాని పాపముల నుండి విముక్తు డగునట్లు నా తండ్రిని కనికరింపుము" అని ప్రార్థించెను.

"కుమారా! నీవు నా భక్తులలో శ్రేష్ఠుడవు. నా దేహమును స్పృశించుటచేత నీ తండ్రి సర్వవిధముల పవిత్రుడయ్యెను. నీవు అతనికి ప్రేత సంస్కారము జరిపినచో అతడు ఉత్తమ లోకములను జేరును" అని నృసింహమూర్తి ప్రహ్లాదునితో పలికెను.

బ్రహ్మదేవుడు నరహరికి నమస్కరించెను. ఇక ఎప్పుడూ అసురులకు ఇట్టి వరము లీయవలదని బ్రహ్మదేవుని నరహరి హెచ్చరించెను.

దుష్టులను కనికరించుట మంచిదిగాదు. అపాత్రదానము ఆపదలనే తెచ్చిపెట్టును. కోరిన దిచ్చుటకన్నను అర్హత నెరిగి అనుగ్రహించుట సముచిత కార్యము కాగలదని నరహరి అభిప్రాయము. ఇలా పలికి విష్ణువు అంతర్హితు డయ్యెను.

హిరణ్యకశిపుడు అహంకారమునకు ప్రతిరూపము. ద్వంద్వముల నావిష్కరించునది ఈ అహంకారమే. సంకల్పములను కదలించునది, సంతాపమును కలిగించునది కూడా అహంకారమే. అందుచేత అది సంధిలోనే సంహరింపబడాలి.

ఇంటా బయట చావకూడదని హిరణ్యకశిపుడు బ్రహ్మను వరముకోరెను. నరహరి అతనిని గడపపై వధించెను. రాత్రి సమయమునగాని, పగటిపూటగాని మరణించకూడదని దైత్యరాజు వరము కోరగా శ్రీహరి అతనిని సంధ్యాసమయాన వధించెను. సంధిలోనే బంధములు తొలగాలి. అందుచేతనే స్తంభము మధ్యనుండి అచ్యుతు డరుదెంచెను. రెండు సంకల్పముల మధ్య ఈశ్వర చైతన్యము అనుభవమునకు అందును.

అంగనా మంగనా మన్తరే మాధవో మాధవం మాధవం చాన్తరే ణాంగనా

ఇరువురు గోపభామల మధ్య గోపాలుడు. రెండు సంకల్పాల మధ్య పరమాత్మ స్వరూపము. ఇదియే రాసలీలా రహస్యము.

భగవానుడు సర్వవ్యాపి. సర్వగతుడు. ఆయన లేని ప్రదేశము లేదు. అహంకారికి భగవానుడు ఎక్కడా కనిపించడు. ఆర్తుడైన భక్తునికి అన్నిచోట్ల అగుపించును. దైత్యరాజుకు శ్రీహరి ఉన్నచోటు తెలియలేదు. దానవ బాలకునికి శ్రీహరి లేనిచోటు అర్థంకాలేదు.

పరమాత్మ అవ్యక్తుడు. నిర్గుణుడు. అయిననూ ఏకాంత భక్తులైన వారికొరకు రూపమును ధరించి వ్యక్త మగుచుండును. అలాగే ప్రహ్లాదుని కొరకు నారాయణుడు నరహరియై ఆవిర్భవించెను. భగవంతుని వ్యక్త మొనర్చునది భక్తి యొక్కటియే.

శరణాగతుడైన భక్తునికి భయము తెలియదు. దైత్యరాజు ఎన్ని విధముల హింసించినను, నారాయణుడు రక్షించుననే విశ్వాసమును ప్రహ్లాదుడు కలిగియుండెను. బ్రతుకులో బాధలు ఎదురుకావచ్చు. భగవంతునిపై విశ్వాసముంచి జీవించు వారలకు అవి నీటిపై వ్రాతలవలె యుండును.

నృసింహమూర్తి స్తంభమునుండి బహిర్గతమయ్యెను. పరమాత్మ ప్రాణముకలిగిన జీవులయందే గాక అచేతనమైన స్థాణు, వృక్షాదుల యందు కూడాకలదు. కనుక ప్రతివస్తువులోను భగవంతుని దర్శించాలి. రాతిలోని నరహరిని ప్రహ్లాదుడు తన భక్తిద్వారా వ్యక్త మొనర్చెను. విగ్రహములోని పాండురంగని నామదేవుడు వ్యక్తము చేసెను. మనము కూడా మన భక్తిద్వారా భక్తవత్సలుడైన శ్రీనాథుని వ్యక్తము చేయవలెను.

మానవుని రెండు రకముల విషములు హింసించును. ఒకటి అహంకారము. రెండవది మమకారము. ఈ రెండిటి వ్యక్తరూపములే హిరణ్యకశిప, హిరణ్యాక్షులు. ఈ రెండు విషముల నంతముచేయు అమృతములను రెండింటిని పరమాత్మ ఈ స్కంధమున ప్రసాదించెను. అవి 1. **నామామృతము 2. కథామృతము.**

వరములు కోరుకొనుమని నారసింహుడు తెలిపెను. తనకు ఏ వరములు అవసరము లేదనియు, తన తండ్రికి సద్గతిని ప్రసాదింప వలసినదనియు ప్రహ్లాదుడు ప్రార్థించెను. భక్తుడు తన కళ్యాణముపై దృష్టి నుంచడు. లోక కళ్యాణమునే పరమావధిగా కలిగియుండును. హింసించిన వారిని కూడా ప్రేమించును.

ప్రహ్లాదుని వంటి పవిత్రాత్ముడు బిడ్డయగుట చేత దుర్మార్గుడైన దైత్యరాజు ఎవరికీ లభించని శ్రీహరి ఒడిలో ఒదిగి పరుండెను.

ప్రహ్లాదుడు అభిషిక్తుడయ్యెను. శ్రీహరి ఆజ్ఞ ననుసరించి తండ్రికి శ్రాద్ధాది కర్మములను జేసెను. శిరమువంచి దేవతలకు నమస్కరించెను. వారు ప్రహ్లాదుని ఆశీర్వదించిరి.

"ధర్మరాజా! ఈవిధముగా విష్ణుసేవకులైన జయవిజయులు దైత్యులుగా జన్మించి, పరమాత్మచే నిహతులైరి. వారే రావణకుంభకర్ణాదులై జన్మించి రామబాణముతో హతులైరి. వారే మరల శిశుపాలదంతవక్త్రులై జన్మించి శ్రీకృష్ణునిచే వధించబడిరి" అని నారదు డనెను.

నారదుని మాటల నాలకించిన ధర్మరాజు "మహర్షీ! పరమ భాగవతోత్తముడైన ప్రహ్లాదుడు ధన్యుడు. స్వయముగా శ్రీహరిని దర్శించి ఆయనకృపకు పాత్రుడైనాడు" అనెను.

నారదమహర్షి నవ్వుచూ "ధర్మజా! అవును. ప్రహ్లాదుడు ధన్యాత్ముడు. కానీ నీవు కడు ధన్యాత్ముడవు. శ్రీహరి నీ ఇంటియందే యున్నాడు.

యూయం నృలోకే బత భూరి భాగా లోకం పునానా మున యోఽభియన్తి
యేషాం గృహానా వసతీతి సాక్షా ద్గూఢం పరంబ్రహ్మ మనుష్యలింగం ॥

"ధర్మరాజా! మీరు అదృష్టవంతులు. మీ ఇంటియందే శ్రీకృష్ణపరమాత్మ వసించుచున్నాడు. ఇది ఎరిగి యుండుటచేత సాధువులెల్లరు మీ గృహమునకు వచ్చుచుందురు" అనెను.

పరమాత్మ అందరి గృహములలోను యున్నాడు. నారదుడు లాంటి సద్గురువు లభించినపుడు ఆయన ఉన్నట్లు మనకు తెలుస్తుంది. పరమాత్మ మనకు తెలియుటకు భక్తులు మన ఇండ్లకు విచ్చేసి వారి పాదధూళి ద్వారా మన గృహములను పవిత్ర మొనర్తురు. పరమాత్మను తెలియని వారింటికి భక్తులురారు. భీమా సంస్థలవారు [illegible] తిరుగుతుంటారు.

త్రిపురాసుర సంహారము

"ధర్మరాజా! వింటివిగదా! ఈవిధముగా శ్రీమహావిష్ణువు దానవరాజును దండించి బాలుడైన ప్రహ్లాదుని రక్షించెను. ఇలాగే గతంలో ఈ విష్ణువు శివుని గూడా రక్షించెను"

అని నారదుడనెను. ఆ మాట వినగానే శివుని శ్రీమహావిష్ణువు రక్షించిన విధమును తెలుపమని ధర్మరాజు ప్రార్థించగా, నారదుడు త్రిపురాసుర సంహారమును గూర్చి తెలిపెనని శుకబ్రహ్మ పరీక్షిత్తునకు చెప్పుచున్నాడు.

పూర్వము దానవులు దేవతలపై దండెత్తిరి. విష్ణుమూర్తి బలముతో విలసిల్లు దేవతలను ఓడించలేక పరాభవింపబడిరి. ఈ విషయమున క్రుద్ధులైన రాక్షసులు మయుడను రాక్షసుని యండజేరి శరణాగతులైరి.

మయుడు వారికి మూడు పురములను నిర్మించి ఇచ్చెను. స్వర్ణ, రజిత, లోహ భవనములను నిర్మించి నక్తంచరుల కొసంగెను. ఆ భవనములు ఎవరికీ గోచరింపవు. ఊహింప శక్యముగావు. ఈ అసురులు ఆ భవనములలో ప్రవేశించిరి. పూర్వ వైరమును దృష్టియందిడుకొని ముల్లోకములను బాధించి, నశింపచేయసాగిరి.

దు:ఖాతురులైన సర్వులు శంకరుని సమీపించి ప్రార్థించిరి. త్రిపురములలో వసించు రాక్షసులు మమ్ములను తీవ్రవ్యథకు గురిచేయు చున్నారు. వారిని వధించి మమ్ము రక్షింపుడు" అని శరణు వేడిరి. భయపడ వలదని అసురులకు చెప్పిన పశుపతి పాశుపతాస్త్రమును చేబూని ఆ త్రిపురములపై సంధించెను.

ఆదిత్యుని నుండి కిరణములు విరజిమ్మబడునట్లు, నీలకంఠుని నుండి బయల్వెడలిన శరములు ఆ త్రిపురములను గప్పివేసెను. ఆ పురములు గోచరింపవాయెను. త్రిపురములలోని నిశాచరులెల్లరు మూర్ఛిల్లిరి. ఈ విషయము మయాసురునికి తెలిపెను. అతడు తాను స్వయముగా నిర్మించిన అమృతబావిలో అసురులను పడవేసెను.

ఈ అమృతకూపమున బడిన రాక్షసులు వజ్రమువలె దృఢమైన శరీరములను ధరించిరి. అమృతద్రవ పానముచే వజ్రతుల్యమైన దేహములను ధరించి దారుణముగా గర్జించుచున్న రాక్షసులను గాంచి శివుడు కలతచెందెను. విష్ణుమూర్తి ఒక ఉపాయము నాలోచించెను.

బ్రహ్మ ఆవుదూడ కాగా, శ్రీమహావిష్ణువు ఆవుగా మారెను. వీరిరువురు మధ్యాహ్నకాలమున త్రిపురములలో ప్రవేశించిరి. అక్కడ దానవులు గాంచుచుండగా తిరుగుచుండిరి. ఈ ఆవు, దూడల అందమును గాంచి అసురులచ్చెరు వందిరి. ఈ లోగా గోవత్సముతో గూడిన గోమాత అమృత కూపమును సమీపించి అందున్న అమృతము నంతటిని పానముచేసెను. గోవు అందమును గాంచుచు పరవశులైయున్న అసురులకు, గోవు అమృతమును పానము చేయుచున్నదనెడి ఆలోచనయే తట్టలేదు.

మయుడు ప్రవేశించి జరిగిన దంతయు గ్రహించెను. దానవులు శోకమగ్నులైరి. మహాయోగి యైన మయుడు వారలను వారించెను. దైవ మొనరించిన కార్యము అనివార్యమై తీరునని చెప్పెను.

ఆ॥ అమరు లైన దనుజు లైనను నరు లైన, నెంత విపును లైన నెవ్వరైన
దైవికార్థచయము దప్పింపగా లేరు, వలదు దనుజులార! వగవ మనకు.

అని మయుడు పలికెను. విష్ణువు శివునకు దివ్యమైన రథమును, సారథిని, అశ్వములను, ధనుర్బాణములను, కవచమును ఇచ్చెను. మహాదేవుడు కవచమును ధరించెను. రథము నధిరోహించెను. ధనుర్బాణములను చేబూని, మధ్యాహ్నసమయమున ఆ త్రిపురములను భస్మమొనర్చెను. త్రిపురములను దగ్ధ మొనర్చుటచేత త్రినేత్రుడు త్రిపురాంతకుడాయెను. ఈవిధముగా శ్రీమహావిష్ణువు శివుని అనుగ్రహించెను.

ఈ త్రిపురాసుర సంహారము నందలి ఆధ్యాత్మిక అవగాహనను గ్రహించెదము. త్రిపురములు యనగా మూడుపురములని భావము. ఈ త్రిపురముల యందే సర్వులను బాధించు అసురులు చరించుచుందురు. వీరికి మయాసురుడే యాధారము. కానీ అతడు ఎంత యోగియైనను విధాత నతిక్రమించలేడు.

జీవులను పరమాత్మకు దూరము చేయువాసనలే అసురులు. వాసనలు ప్రతిజీవిని బాధించు చుండును. వాసనలు ఎవరికి క్షయమగునో వారే నిత్యానందము ననుభవించెదరు.

అవాసనం మనోఽకర్తృపదం తస్మా దవాప్యతే

"వాసనలు తొలగినచో నిష్క్రియత్వ రూపమైన మోక్షము సిద్ధించు" నని ఉపనిషత్తు ప్రవచించినది.

ఈ వాసనలు జీవికి అశాంతి నందించును. అసురులు మయాసురుని ఆశ్రయించి నట్లు, వాసనలు మాయ నాశ్రయించి యున్నవి.

మయాసురుడు స్వర్ణ, రజిత, లోహ భవనములను అసురులకు నిర్మించి యిచ్చెను. అలాగే మాయ సత్త్వ రజ స్తమో గుణములను అందించినది. గుణములు మాయా నిర్మితములు. మయాసురుడు నిర్మించిన త్రిపురములు దుర్భేద్యములు. వాటిని ఎవ్వరు ఛేదింపలేరు.

దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా
మామేవ యే ప్రపద్యన్తే మాయా మేతాం తరన్తితే

"దైవ సంబంధమైన, త్రిగుణాత్మకమైన, ఈ నా మాయ దాటశక్యము [illegible] ఎవరు నన్నే శరణు పొందుచున్నారో వారు మాయను దాటుచున్నారు" అని భగవా[illegible] భగవద్గీతలోని విజ్ఞాన యోగములో చెప్పియున్నాడు.

ఈ కారణంగా సర్వులు పశుపతిని శరణువేడినారు. పశుపతి ధ్యాన[illegible] వాసనలను నశింపజేయు నుద్దేశ్యముతో త్రిగుణములను దూరం చేసికొనుటకు [illegible] ధ్యానము నాచరించెదము.

ఈశ్వరుడు బాణాలు భయంకరముగా ప్రయోగిస్తూ ఉంటాడు. కానీ [illegible] అమృతద్రవ సంసర్గముచే దృఢకాయు లగుచుండిరి. మనము తీవ్రమైన [illegible] లాచరిస్తూ ఉంటాము. కానీ వాసనలు ప్రాపంచిక విషయవాసనా ద్రవములో [illegible] దృఢమవుతూ గోచరిస్తాయి.

రాక్షసులు సంహరింప బడలేదని శివుడు కలత చెందుతాడు. వాసనలు నశించలేదనియు, గుణములు ఛేదింప బడలేదనియు ధ్యానయోగి వ్యథచెందుతాడు. అట్టి సమయాలలో పరమాత్మ కరుణయే, విష్ణువు ఈశ్వరుని కాపాడినట్లు మనలను కాపాడగలదు.

విష్ణుమూర్తి గోరూపమును ధరించి అమృతము నంతటిని అదృశ్యమొనర్చెను. గోవు సత్త్వగుణ సంకేతము. సత్త్వగుణ ప్రధానులైన వారిని ప్రాపంచిక విషయములు బాధించ లేవు. సత్త్వగుణము లభ్యమైన పిదప గుణాతీత స్థితి లభించును.

సత్త్వగుణ ప్రధానులైనవారు ధ్యానస్థితిలో స్థిరపడగలరు. గోరూపముతో విష్ణువు అమృత ద్రవపానము చేయగనే అసురులు బలహీనులైరి. సత్త్వగుణము వృద్ధి చెందగనే వాసనలు నిర్వీర్యమగును.

శివుడు విష్ణువునుండి ధనుర్బాణములు గ్రహించును. ధ్యానయోగి పరమాత్మనుండి అనుగ్రహమును పొందును. శివుడు బాణములను ప్రయోగించగనే త్రిపురములు ధ్వంసముకాగా అసురులు అంతమైనారు. ధ్యానయోగి చిత్తైకాగ్రత యనెడి ధ్యాన ధనుస్సును ప్రయోగించగనే త్రిగుణములు అదృశ్యమగును. వాసనలు క్షాళనమగును. ఇదియే ముక్తి లేక మోక్షము. త్రినేత్రధారి యగు పరమేశ్వరుడు ఈవిధముగా త్రిపురహరుడాయెను.

త్రినేత్రధారియగు శివునకు సూర్యచంద్రులు రెండు నేత్రములు కాగా, అగ్ని నొసటన మూడవ నేత్రమై యున్నాడు. ఈ త్రినేత్రములు సృష్టి స్థితి లయాదులను సాగించునవియై యున్నవి. పరమేశ్వరుని నొసటన భాసించు మూడవనేత్రము జ్ఞాననేత్రము. శివుడు మూడవకన్ను తెరువగనే ప్రపంచము భస్మమగును. జ్ఞాననేత్రము తెరువబడగనే ఈ దృశ్యమాన ప్రపంచము అదృశ్యమై సత్యానుభవము కలుగును.

ధ్యానమూర్తియైన పరమశివుడు త్రిపురహరుడైనట్లు, ధ్యానయోగులందరు త్రిపురహరులు కావలెను.

పురత్రయే క్రీడతి యశ్చ జీవః

అని యజుర్వేదము నందున్నది. జీవుడు జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థ లనెడి పురత్రయము నందు సంచరించుచున్నాడు. ఎవరైతే అవస్థాత్రయము నధిగమించి సాక్షిరూపు లగుదురో వారు త్రిపురహరులై తరించెదరు.

"ధర్మరాజా! విష్ణుదేవుని మహిమలను చక్కగా గ్రహించుచున్నావు. ఇంకను ఏ విషయములను గ్రహింప దలచితివో అడుగుము. చెప్పెదను" అని నారదమహర్షి చెప్పగా భక్తిని పొందుటకు ఏ ధర్మములను, ఆచారములను అనుష్ఠింపవలెనో తెలుపుమని ధర్మరాజు ప్రశ్నించెను. నారదమహర్షి చెప్పుచున్నాడు.

ఆచారములు-ధర్మ స్వరూపము

ధర్మము నాచరింప గలవాడైనందున మానవుని దేహమునకు ధర్మక్షేత్రమనెడి పేరుకల్గినది. ఈ దేహమనెడి దేశములో కురుక్షేత్ర మనెడి ప్రదేశము గలదు. అదియే మనస్సు. ఇక్కడ మంచి చెడులకు తీవ్ర సంఘర్షణ జరుగుచుండును. ఇచ్చట మనిషి ప్రగతిని సాధించాలి. పతనాన్ని నిరోధించాలి. ప్రగతి కుపకరించునదియే ధర్మమని పిలువబడుతుంది.

స్వధర్మాన్ని విస్మరించిన వారికి ప్రగతి లభించదు. శాంతి ఉదయించదు. సుఖము ప్రాప్తించదు. ఈ ధర్మాచరణ ఆయావ్యక్తుల మనోస్థితులపై ఆధారపడి యుంటుంది. ఇక్కడే వ్యక్తికి వ్యక్తికి వ్యత్యాసము గోచరిస్తుంది. ఈ వ్యత్యాసమే వర్ణాశ్రమ ధర్మాలకు నాంది పలికింది.

వేదత్రయ గత ధర్మః చతుర్ణాం వర్ణానాం ఆశ్రమాణాం చ ధర్మ స్థాపనాదౌ పకారికః

వేదాలలో నాలుగు వర్ణముల వారికి ప్రత్యేకంగా తెలుపబడిన ధర్మములు ఆయావర్ణముల వారిచే వాటిని అనుష్ఠింప చేయుటకు ఉపకరించుటచేత సర్వులకు ధర్మాచరణము అభ్యుదయమునే ప్రసాదిస్తుందని చాణక్యుడు అర్థశాస్త్రంలో చెబుతాడు. కనుక ధర్మమును సర్వులూ రక్షించాలి. ధర్మరక్షణలో తన ఔన్నత్యం ఇమిడి యుందని గ్రహించాలి.

ధర్మ ఏవ హతో హన్తి ధర్మో రక్షతి రక్షితః

"ధర్మమునకు హాని చేయువాడు ధర్మము చేతనే హతుడగుచుండగా, ధర్మమును ఎవడు రక్షించునో, వాడు ధర్మముచే రక్షింపబడుచున్నాడు. కనుక సర్వజీవుల మనుగడకు ధర్మమే ప్రధానమైయున్నది.

సర్వులూ ధర్మమునే ఆచరించాలి. అధర్మము నాచరింపకూడదు. ధర్మము వలన రాజ్యము లభిస్తుంది. ధనము ప్రాప్తిస్తుంది. సుఖం కలుగుతుంది. ఇంకా ఎన్నో ప్రయోజనాలు సమకూరుతాయి. కానీ అధర్మం యొక్క ఫలితము మాత్రము ఒక్కటే అది ఏమనగా దుఃఖము ననుభవించుట.

ధర్మా ద్రాజ్యం ధనం సౌఖ్యం అధర్మా ద్దుఃఖ సంభవః

"ధర్మమువలన రాజ్యము, ధనము, సుఖము లభిస్తుండగా, అధర్మము వలన లభించేది దుఃఖమొక్కటియే" నని మహాభారతంలో తెలుపబడింది.

ధర్మజు డడిగిన విషయములను నారదమహర్షి చెప్పుట కుపక్రమించినాడు. "ధర్మరాజా! భగవానుడే ధర్మమునకు మూలము. ధర్మము ద్వారానే మనస్సు శాంతించును" అని మొదలిడెను.

మానవు డాచరింపదగిన ధర్మము లనేకములు గలవు. శౌచాదులు దేహమున కుపకరించును. సత్యాహింస బ్రహ్మచర్యాదులు మనస్సునకు సంబంధించినవి. శమ దమాదులు ఇంద్రియాలకు సంబంధించి యుండును. ధర్మాచరణములో వ్యక్తి పునీతుడగును. అగ్నిద్వారా గనులనుండి బయల్వెడలిన స్వర్ణము శుభ్రపడునట్లు, ధర్మముద్వారా జీవి శుద్ధిపడును.

కర్మణా మనసా వాచా యత్నా ద్ధర్మం సమాచరేత్

ప్రతి మానవుడు త్రికరణశుద్ధిగా తనకు శాస్త్రము చెప్పిన ధర్మము నాచరింప వలెనని యాజ్ఞవల్క్యస్మృతి తెలిపింది.

"పరీక్షిన్మహారాజా! ఇక స్త్రీలయొక్క ధర్మములను నారదుడు ధర్మరాజునకు తెలుపుచున్నాడు" అని గంగాతీరంలో శుకబ్రహ్మ చెప్పుచున్నాడు.

స్త్రీ ధర్మము

ధర్మాచరణము, పతిసేవ వలననే స్త్రీకి ముక్తి లభించును. స్త్రీ పతిసేవలో తృప్తి చెందాలి. పతిని తృప్తి పరచిన భార్య శ్రీపతిని తృప్తిపరచిన దగును. పతికి సేవచేయుట యనగా కేవలం దేహ సంబంధమైన సేవలనియే భావింపరాదు.

స్త్రీణాం చ పతిదేవానాం తచ్ఛు శ్రుషానుకూలతా

పతిసేవలో పతికి అనుకూలముగా జీవించుట యనునది కూడా చోటుచేసుకొని యున్నది. కొందరు తమ కనుకూలముగా భర్త చరించాలని భీష్మించుకుంటారు. అలాంటివారి సేవ పతిసేవ క్రిందికిరాదు. "నేను మీకు ఎంతో సేవచేశాను కదా! ఒక్కసారి నిందిస్తే ఏమైంది?" అని కొందరు స్త్రీలు అంటుంటారు. ఈ వాదనలు వేదనను తొలగించలేవు. బిందెడు పాలలో ఒక్క విషబిందువు పడితే చాలును. ఆ తరువాత వేసిన వారు కూడా వేరుచేయలేరు.

పతికి అనుకూలముగా జీవించుటయే గాక పతి నియమాలను పాటించాలి. భర్త బంధువులను ప్రేమించగలగాలి. కొందరు స్త్రీలు భర్తను తెగ ప్రేమించేస్తుంటారు. కానీ ఆయన బంధువులను, సోదరీలను వేధిస్తుంటారు. అలాంటి వారి విషయంలో భర్తలు సర్దుకుపోతుంటారు. అంతమాత్రాన భర్తల మనస్సులలో వెలితిలేదని అనుకోవడం భార్యల పొరపాటు. ఆయనతో పాటు ఆయన బంధువులను కూడా ప్రేమించాలి. ఈ అలవాటు క్రమేపీ భగవంతునితో పాటు భగవద్భక్తులను కూడా ప్రేమించే స్థాయికి చేరుతుంది.

స్త్రీ ఇంటిని పరిశుద్ధంగా ఉంచుకోవాలి. గృహమును చక్కగా అలంకరించాలి. అలాగని భర్త ఆదాయమునకు మించి అలంకరణములకు ఖర్చుచేయరాదు. అలాచేసినచో ఇల్లు అందంగా ఉండవచ్చునేమోగాని పతి ముఖము మాత్రము వాడిపోయే ఉంటుంది. ఏడుపులుండే గృహంలో వేలుపు లుండరు.

భర్తపట్ల వినయంగా వర్తించాలి. ప్రియంగా మాట్లాడాలి. అబద్ధాలు చెప్పకూడదు. "మొన్న మీరు అబద్ధాలు చెప్పలేదా?" అని భర్తను ప్రశ్నించకూడదు. అతను అబద్ధాలాడింది వాస్తవమే కావచ్చు. అలాగని ఆమెకూడా అబద్ధాలాడితే ఇక అతనిని ఎలా సరిచేయగలదు? పతిని పతనం గాకుండా చూడవలసిన బాధ్యత సతి కున్నదని నారదుడు ధర్మజునికి చెప్పుచున్నాడు. ఈవిధంగా జీవించ గలిగిన స్త్రీ, లక్ష్మీదేవి వైకుంఠములో నారాయణునితో కలసి జీవించినట్లు, గృహంలో పతితో జీవింపగలదు.

పురుషుని ధర్మము

మానవుడు నాలుగు ఆశ్రమములలోను ధర్మము నాచరింపవలెను. బ్రహ్మచర్యాశ్రమములో వ్యక్తి వృద్ధిని సాధించును. గృహస్థాశ్రమములో క్షయము జరుగును. వానప్రస్థాశ్రమములో పున: వ్యక్తి శక్తివంతుడు కావలెను. సన్యాసాశ్రమములో తరింపవలెను.

బ్రహ్మచారికి గురువునందు శ్రద్ధాభక్తులుండాలి. గురువునకు హితము చేకూర్చుతూ జీవించాలి. గాయత్రిని జపించాలి. గురువు చెప్పిన విషయాలను శ్రద్ధగా ఆచరించాలి.

ఉపక్రమేఽవసానే చ చరణౌ శిరసా నమేత్

గురుసాన్నిధ్యమునకు వచ్చినపుడు, వెళ్ళునపుడు శిరమువంచి గురువు చరణములకు నమస్కరించాలి. మితాహారియై యుండాలి. అనలసుడై యుండాలి. బ్రహ్మచారి స్త్రీలతో ముచ్చటించరాదు. స్త్రీ అగ్ని వంటిది. పురుషుడు నేతికుండవంటివాడు.

బ్రహ్మచారులు సుగంధ లేపనములను విసర్జింపవలెను. గురువాక్యములను శ్రద్ధగావినాలి."**శ్రద్ధయాదేయం, అశ్రద్ధయాఅదేయం**" శ్రద్ధగా దానం చేయమనియు అశ్రద్ధగా దానం చేయరాదని కూడా శాస్త్రము తెలుపుతుంది. అలాగే ఆచరింపవలసిన వాటిని ఆచరించడము, ఆచరింపకూడని వాటిని త్యజించడము ఇవి బ్రహ్మచారులతోపాటు గృహస్థులు, వానప్రస్థులు కూడా ఆచరించాలి.

పురుషుడు క్రోధరహితుడై ఉండాలి. నిగర్వియై యుండాలి. దంభాభిమానములను త్యజించాలి. అహంకార రహితుడై యుండాలి.

అక్రోధేన జయేత్క్రోధం గర్వంతు వినయేనచ

"సహనంతో క్రోధమును, వినయముతో గర్వమును జయించమని శాస్త్రవచనము. అలాగే పురుషుడు ఇంద్రియలోలుడు కాకూడదు. వీర్యనష్టము బ్రతుకునే నశింపచేయును.

ఆయుష్కామేన వస్తవ్యం, న జాత పరయోషితి

"దీర్ఘకాలము జీవింప గోరువాడు స్త్రీకి దగ్గర గాకూడదు" యని చరకసంహిత చెబుతుంది. ఈవిధంగా వ్యక్తి మంగళకరమైన జీవితమును కొనసాగించాలి.

ఈవిధంగా సదాచారవంతుడైన పురుషుడే పరమాత్మను తెలిసికొనగలడు. తాను తనకు, ఇతరులకు బాధను కలిగించేలా ఉండకూడదు.

నాస్తి ధర్మాత్పరో బంధుః నాస్తి ధర్మాత్పరం ధనం

"ధర్మానికి మించిన మరో బంధువు లేరు. ధర్మానికి మించిన మరో ధనం లేదు" అని బ్రహ్మవైవర్త పురాణము ప్రవచించినది.

ప్రహ్లాదాజగర సంవాదము

అజగరుడను మునికి, ప్రహ్లాదునికి గతంలో జరిగిన సంవాదమును వివరించుచు యతి లక్షణములను నారదుడు ధర్మరాజుకు చెప్పుచున్నాడు.

యతిపురుషుడు జ్ఞానము నభిలషించువాడై యుండాలి. ప్రతిగ్రామము నందును ఒక్క రాత్రికి మించి యుండరాదు. విషయవాసనా శూన్యుడై యుండాలి. మానమును కాపాడుకొను వరకే వస్త్రమును ధరించాలి. భిక్షను మాత్రమే గ్రహించాలి. నిరాశ్రయుడై యుండాలి. సర్వభూతములను ప్రియముగా చూచువాడై యుండాలి. శాంతుడై యుండాలి.

సర్వత్ర ఆత్మనే దర్శించువాడై యుండాలి. ఆత్మకన్నను అన్యమైన శాస్త్రములను శ్రవణము చేయకూడదు. తర్కమును విడనాడవలెను. అతడే సన్యాసియగును.

ఒకప్పుడు ప్రహ్లాదుడు సచివులతోగూడి లోకజ్ఞానమును పొందుటకై సమస్తలోకములను పర్యటించెను. కావేరీనదీ తీరమున ఒకముని నేలపైబడి యుండుటను గాంచెను. అతడు సిద్ధ పురుషుడా? కాడా? అనెడి సంశయము కదలెను.

ప్రహ్లాదుడు మునిని సమీపించెను. శిరమువంచి ఆయన పాదములకు నమస్కరించెను. ఒక ప్రశ్ననడిగెను.

"మహాత్మా! నీవు స్థూలమైన దేహమును కలిగియున్నావు. భోగియైన వానికే ఇలాంటి దేహముండును. ఇట్టి దేహమును పొందుటకు భోగము ననుభవింపవలెను. భోగము ననుభవించుటకు ధనమవసరము. ధనమనేది ప్రయత్నశీలునకే లభించును. మరి నీవు ఏ ప్రయత్నములేక పడియున్నావు. నీకు ఈ స్థూలదేహ మెలాకలిగినది?" యని ప్రశ్నించెను.

ఆ ముని నవ్వుచున్న వాడై ప్రహ్లాదునితో ఇలా పలికెను: "దైత్యనందనా! నీవు అసమానుడవు. నీవు అంతర్దృష్టిద్వారా సర్వమును తెలిసికొనగలవు. నీవు చర్చించుటకు యోగ్యమైన వాడవు. శ్రేష్ఠుడవు. చెప్పెదను వినుము" అని చెప్పసాగెను.

"ప్రహ్లాదా! కర్మవలయంలో చిక్కుకొని అనేక జన్మలయందు విషయ చింతనా పరుడనై సుఖాభిలాషినై చరించినాను. గతంలో నానాయోనుల యందు జొరబడి చరించినాను. ఇలా ప్రవర్తించుచు మానవదేహమును ధరించితిని. ఈ మానవజన్మ యందు గూడా కర్మలు దుఃఖమునే పంచుచున్నవని గ్రహించి కర్మల నుండి నివృత్తి బొందితిని.

"జీవి నిజస్వరూపము సచ్చిదానందమని గ్రహించితిని. కర్మలు బంధకారణములని తెలిసికొంటిని. భోగములు తుచ్ఛములని గ్రహించితిని. ఆత్మను వదలి అన్యవిషయముల

యందు సుఖమును బొందగోరువాడు ఎండమావులలో దప్పిక దీర్చుకొనుటకు యత్నించు వాడేనని అవగత మొనర్చుకొంటిని.

"అర్థకామముల అనర్థమును గ్రహించితిని. ధనికుల నెందరినో జూచితిని. వారు లుబ్ధులై యున్నారు. ఇంద్రియ నిగ్రహము లేనివారై యున్నారు. భయముచేత నిద్రలేని వారైయున్నారు. ఇదంతయు ధనముచే లభించిన దరిద్రమని గ్రహించితిని.

"ధనవంతులేగాదు, బలవంతులను గూడ జూచినాను. వారికి కూడా భయమే. రాజులవలన, దొంగలవలన, శత్రువులవలన, బంధువులవలన, యాచకులవలన, కాముకులవలన వారూ భయపడుతూనే యున్నారు. కనుక బుద్ధిమంతు డగువాడు ఈ అర్థబలములను త్యజించుటయే మంచిది.

"ఈవిధముగా నేను వైరాగ్యమును, సంతృప్తిని పొంది ఆనందముగా జీవించుటకు ఇరువురు గురువులు కారణమై యున్నారు. వారు 1. తేనెటీగ 2. అజగర పాము.

క॥ అజగరమును జుంటీగయు నిజగురువులుగా దలంచి నిశ్చింతుడ నై
విజనస్థలి గర్మంబుల గజిబిజి లేకున్నవాడ గౌరవవృత్తిన్.

"ప్రహ్లాదా! దొరికిన దానితో నేను తృప్తిచెందెదను. బట్టలు లభించిన కట్టుకొందును. లేనిచో అలా పడియుందును ఏదైనను తిందును. రుచు లెరుగను. అభిరుచు లెరుగను. లేనిది కావలెనని యాచింపను. ఉన్నది పోయినదని దుఃఖింపను.

క॥ లేదని యెవ్వరి నడుగను రా దని చింతింప బరులు రప్పించినచో
గా దని యెద్దియు మానను ఖేదము మోదమును లేక క్రీడింతు మదిన్.

నేను పరులను నిందించను. ఎవరినీ సహాయము కోరను. సంపద లేదని వగచను. అలాగని స్వేచ్ఛా జీవితానికి అలవాటు పడను. ఇలా సదా ఆత్మానందములో నతి యుందును" అనెను. ప్రహ్లాదుడు ఆ దివ్యాత్మునకు నమస్కరించి వెళ్ళెను.

ప్రహ్లాదాజగర సంవాదము నాలకించిన ధర్మరాజు "మునిశ్రేష్ఠా! మరి మానవులు గృహస్థులకు అట్టి దివ్యస్థితి ఎలా ప్రాప్తించునో, మోక్షమెలా కలుగునో చెప్పుము" అని ప్రశ్నించగా నారదుడు గృహస్థు డాచరింపవలసిన సదాచారములను తెలుపుచున్నాడు.

గృహస్థుని ధర్మములు

గృహస్థు డైనవాడు నిత్యము గృహోచిత కర్మల నాచరించుచు, మహాత్ములను సేవించుచు, సర్వకర్మములను వాసుదేవునకు సమర్పించుచుండవలెను. భక్తులతో సత్సంగమున రమించువాడై యుండవలెను. భగవత్కథా శ్రవణము నందు ఆసక్తి యుండవలెను. పుత్ర మిత్ర కళత్రాది సంగములు స్వప్న తుల్యములని తెలియవలెను. అవసరమైన వస్తువులనే గ్రహించుచుండవలెను. లోపల నిస్సంగుడై యుండి బాహ్యమున ఆసక్తి యున్నవానివలె గోచరించుచు ప్రవర్తింపవలెను.

తనకెంత ధనము అవసరమో అంతే ధనమును పొంది యుండవలెను. అంతకు మించి కోరువాడు చోరుడగును. జంతువులను బిడ్డలవలె చూడవలెను. ఆహారమును జీవులతో పంచుకొని భుజింపవలెను. ఉన్నదంతయూ మనదని భ్రమింపరాదు. తిన్నదే మనదని జ్ఞాపక ముంచుకొనవలెను. మితాహారమే హితమని గుర్తింపవలెను. అతిథులను సేవింపవలెను.

ఆ॥ జనకగురుల నైన జంపు నర్థమున కై ప్రాణమైన విడుచు భార్యకొఱకు
నట్టిభార్య బురుషు డతిథిశుశ్రూష సే యించి గెలుచు నజితు నీశు నైన.

మానవుడు ధనము కొఱకు తండ్రిని, గురువులను కూడా వధించును. అతడే భార్యకొఱకు ప్రాణముల నర్పించుటకు కూడా సిద్ధమగును. మరి అట్టి భార్యాభర్త లిరువురు అతిథిసేవలో తృప్తి చెంద గలిగినచో అట్టివాడు పరమేశ్వరుని గూడ గెలుచును.

మల మాంసాదులతో నిండి, బూడిదగా మారిపోవు దేహముపై మోహము నుంచక, సర్వగతుడైన ఆత్మను పొందుటకు యత్నించువాడు అమరుడగుచున్నాడు. యజ్ఞముల కన్నను అన్నదానము శ్రేష్ఠమైనది. జీవులను అన్నముద్వారా తృప్తి పరచవలెను. తీరిక సమయాలలో తీర్థాటనలు చేయవలెను. భగవన్మూర్తుల నారాధింపవలెను.

శెలవు దినములలో ఎక్కువకాలము జపమును కొనసాగించాలి. లేదా ఆలయముల కెళ్ళి భగవంతుని దర్శించాలి. ద్రవ్యయజ్ఞము నాచరించాలి. తపోయజ్ఞమును సాగించాలి. స్వాధ్యాయ యజ్ఞమును కొనసాగించాలి. జపయజ్ఞమును విధిగా అనుసరించాలి.

హింస చేయరాదు. శాస్త్రములకు అహంకారముచే వక్రభాష్యము చేయరాదు. కామ్యమును వదలిన వానికి సామ్య మెవ్వరునులేరు. అతడు నిత్యసంతృప్తుడై యుండును.

సదా సంతుష్ట మనసః సర్వాః శివమయా దిశః
శర్కరాకంట కాదిభ్యో యథోపాన త్పదః శివమ్

"రాళ్ళు, ముళ్ళు యున్నను పాదరక్షలు వేసికొని వెడలువానికి భయములేనట్లు సంతుష్టచిత్తునకు అన్ని వైపులనుండి శుభములే కలుగును."

ఎవడు ఇంద్రియములకు దాసుడగునో వాని జ్ఞానము నశించును. తపస్సు క్షీణించును. కీర్తి మంటగలియును. దీనస్థితి ఏర్పడును.

ఔపస్థ్య జైహ్వ్యకార్పణ్యా ద్గృహ పాలయతే జనః

"గుహ్యేంద్రియ, జిహ్వేంద్రియముల సుఖమును వాంఛించి మానవుడు దేహమనెడి ఇంటిని కుక్కవలె కాపలా కాయుచున్నాడు."

ఆశకు అంతములేదు. శ్వాసలు నడచువరకు ఆశలు ఆగవు. పండితులైనను ఆశకు దాసులగుట వలన దుఃఖముల ననుభవించుచున్నారు.

అసంకల్పా జ్జయే త్కామం క్రోధం కామ వివర్జనాత్
అర్థానర్థే క్షయా లోభం భయం తత్త్వావ మర్శనాత్

సంకల్పమును వదలినచో విషయముల యందు ఆసక్తి పోవును. కోరికలను వదలుటచే క్రోధము అదృశ్యమగును. అర్థమనర్థమని భావించుటవలన లోభము పోవును. తత్త్వమును విచారించినచో భయము నిర్మూలింపబడును.

వివేకముద్వారా శోకమోహాలు నశించును. సాధువులను సేవించుటవలన దంభము పోవును. గురుభక్తి ద్వారా సమస్తమును పొందగలుగును.

క॥ హరిమహిమ దవకు జెప్పిన గురువుప్ వరు డనుచు దలచి కుంఠితభక్తిం
దిరుగు పురుషుశ్రమ మెల్లను కరిశౌచముక్రియ నిరర్థకంబగు వధిపా।

"ధర్మరాజా! తనకు భగవంతుని స్వరూపము నెఱుకపరచిన గురువును తనతో సముడైన మానవుడని భావించుచో వాడు ఉత్తమగతిని పొందుట కెంత ప్రయత్నించినను వ్యర్థమే యగును. గజస్నానము వలె నిరుపయోగ మగును.

"యుధిష్ఠిరుడా! నీవు ధన్యజీవివి. మోక్షమే నీ ఇంటి యందున్నది. గ్రహించి తరింపుము.

సవా అయం బ్రహ్మ మహ ద్విమృగ్య కైవల్య నిర్వాణ సుఖాను భూతిః
ప్రియః సుహృద్వః ఖలు మాతులేయ ఆత్మార్హణీయో విధి కృద్గురుశ్చ

"సాధువులు అన్వేషించి పొందదగిన బ్రహ్మము మీ ఇంటిలో చుట్టమునై, బావయై, ఆత్మస్వరూపమై, వందనీయుడై, గురువైయున్నాడు" అని నారదుడు పలికెను.

"పరీక్షిన్మహారాజా! నారదుని మాటల నాలకించిన ధర్మరాజు శ్రీకృష్ణుని అర్చించి ఆనందించెను" అని శ్రీశుకుడు చెప్పెను.

సప్తమ స్కంధము సమాప్తము

...... ఓం ....



